జగన్ సర్కారుపై ఉద్యోగులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఇప్పటికే పలు వర్గాల వారు పోరుకు దిగారు. తమ సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తాడోపేడో అనే రీతిలో సమ్మెబాట పట్టారు. గ్రామస్థాయిలోని అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు మొదలు మునిసిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులు.. చివరకు న్యాయవాదులు సర్కారు తీరుపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయా వర్గాలకు చెందిన వేలాదిమంది ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నారు. తాజాగా వలంటీర్లు కూడా రోడ్డెక్కడానికి సిద్ధమయ్యారు. ఇలా జిల్లావ్యాప్తంగా పక్షంరోజుల నుంచి ఎటుచూసినా ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు మార్మోగుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ నెలకొన్న ఈ పరిస్థితి అధికార వైసీపీ నేతలను ఆందోళనకు గురి చేస్తోంది.



యూటీఎఫ్ మహా ధర్నాలో శీర్షాసనం వేసి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయుడు



ఒంగోలులో కలెక్టరేట్ ముట్టడికి తరలివచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

ఉద్యోగుల తిరుగుబాటు

- ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న నిరసనలు
- విభిన్నవర్గాల పోరుబాట
- 23వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె
- కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల ఉద్యమం
- మునిసిపల్ కార్మికుల సమ్మె ఉధృతం
- అదే దారిలో వలంటీర్లు
- ఇప్పటికే ఉపాధ్యాయులు, ఆశాల ఆందోళనలు
- రెవెన్యూ చట్టంపై న్యాయవాదుల ఆగ్రహం

ఒంగోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వేతన జీవులు భగ్గుమంటున్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు అంగన్‌వాడీలు, మున్సిపల్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇప్పటికే రోడ్డెక్కారు. ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా నినదిస్తున్నారు. ఒకరి తర్వాత ఒకరు అన్నట్లు పలు శాఖల వారు ఉద్యమబాట పడుతున్నారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మునిసిపల్ కార్మికులు ఇతర పలు ప్రభుత్వ శాఖల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరంతా కొద్దిపాటి వేతనం, గౌరవ వేతనం తీసుకుంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో 50వేల మందికిపైగా ఈ తరహాలో పనిచేస్తుండగా రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలోనే అలాంటి వారు ఉన్నారు. గత ప్రభుత్వాలు సమయానుకూలంగా వారికి వేతనాల పెంపు, ఇతర సౌకర్యాలు అమలు చేసేవి. సమస్యల పరిష్కారం కోసం వారు ఆందోళనలు, నిరసనలకు దిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరున్నా సానుకూల దృక్పథంతో వ్యవహరించి పరిష్కారానికి చొరవ చూపేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిభిన్నమైన పరిస్థితి నెలకొంది. తమ సమస్యల పరిష్కారం, హక్కుల కోసం గళం విప్పిన వారిపై కేసులు, వేధింపులతో అణచివేత అధికమైంది. దీంతో ప్రభుత్వంపై ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం నెలకొంది.

హామీల అమలు మరిచి..

గతంలో వైసీపీ అధినేతగా పాదయాత్ర సమయంలోనూ, ఎన్నికల ప్రచారంలోనూ వివిధ వర్గాల వారికి జగన్ ఎడాపెడా హామీలు ఇచ్చారు. అంగన్‌వాడీలు, ఆశాలకు వేతనాల పెంపు, ఇతర సౌకర్యాల కల్పన, మునిసిపల్ కార్మికులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం వంటి పలు అంశాలపై హామీలు గుప్పించారు. అయితే అధికారంలోకి వచ్చాక వాటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. నాలుగున్నరేళ్లలో కనీసం ఆ హామీల ఊసెత్తకపోగా అనేకసార్లు సంబంధిత సంఘాల వినతులను కూడా పట్టించుకోలేదు. అలా సమస్యల పరిష్కారానికి చర్యలు లేకపోగా వారిపై పనిభారం పెరిగింది. మరోవైపు కొద్దిపాటి వేతనంతో పనిచేస్తున్న వారిని ఉద్యోగులుగా పేర్కొంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కోత పెట్టారు. దాంతో ఆయా వర్గాలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరుకు విభిన్నవర్గాలు సిద్ధమయ్యాయి.

అదే బాటలో వలంటీర్లు

వలంటీర్లు కూడా ప్రభుత్వం పట్ల తీవ్ర ఆగ్రహంతోనే ఉన్నారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో వారు సమ్మెకు దిగుతుండగా ఆ ప్రభావం మన జిల్లాలో కూడా ఉండే అవకాశం కనిపిస్తోంది. మొత్తం మీద జిల్లా పక్షంరోజులుగా ఎటుచూసినా ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ధర్నాలు, ర్యాలీలు, మానవహారాలు, దీక్షలతో దద్దరిల్లుతోంది. బుధవారం కూడా ఆయావర్గాల వారు భారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. రానున్న రోజుల్లో ఇవి మరింత ఉధృతమయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎన్నికలవేళ నెలకొన్న ఈ పరిస్థితి అధికార పార్టీ నేతలను ఆందోళనకు గురి చేస్తోంది.

అంగన్‌వాడీలతో ప్రారంభం..

వామపక్ష కార్మిక సంఘాల నేతృత్వంలో ఉండే పోరాట పటిమ అధికంగా ఉన్న అంగన్‌వాడీలు ముందుగా పోరుకు దిగారు. తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ జిల్లాలోని 2,903 కేంద్రాలకు చెందిన ఐదువేల మందికి పైగా కార్యకర్తలు, ఆయాలు సమ్మెబాట పట్టారు. కేంద్రాలు మూసి సమ్మెలోకి వెళ్లి బుధవారం నాటికి 23 రోజులు పూర్తయింది. ఆలనాపాలనా లేక అంగన్ వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. అయితే సచివాలయ ఉద్యోగుల ద్వారా వాటిని నడిపేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఫలితం ఇవ్వలేదు. మరోవైపు జిల్లాలో విద్యాశాఖ పరిధిలో జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు పాఠశాలలు, విద్యాశాఖ కార్యాలయాల్లో పనిచేసే సుమారు 5వేల మందికిపైగా ఎస్ఎస్ఏలోని కాంట్రాక్టు ఉద్యోగులు విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేపట్టారు. వారి సమ్మె 15 రోజులకు చేరింది. తాజాగా మునిసిపల్ కార్మికులు గత మంగళవారం నుంచి సమ్మె ప్రారంభించారు. ఒంగోలు కార్పొరేషన్‌తోపాటు మరో ఆరు మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఉన్న రెండున్నరవేల మంది ఒప్పంద, పొరుగు సేవల పారిశుధ్య కార్మికులు, చెత్త రవాణా వాహనాలు నిలిపివేసి సమ్మెకు దిగారు. తాజాగా రెవెన్యూ చట్టంలో తెచ్చిన భూ ట్రిబ్యునల్‌ను వ్యతిరేకిస్తూ భూసంబంధ రెవెన్యూ కోర్టులను న్యాయవాదులు బహిష్కరించారు. దీంతో రెవెన్యూ కోర్టులలో ఉన్న భూవివాదాల పరిష్కారాలు ఆగిపోయాయి. ఇప్పటికే వివిధ రూపాల్లో పెద్దఎత్తున నిరసనలు చేపట్టిన ఆశావర్కర్లు కూడా చలో విజయవాడ కార్యక్రమానికి, తదుపరి సమ్మెకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఉపాధ్యాయులు కూడా రోడ్డెక్కుతున్నారు. ఆర్థిక బకాయిల కోసం సోమవారం ఒంగోలులో యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు.



నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు



ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన శిబిరంలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

పెండింగ్ ప్రాజెక్టులే ప్రధానాస్త్రం

- వెలిగొండ ప్రాజెక్టు సాధన ప్రాంగణంగా పేరు
- ఉగ్ర ఆధ్వర్యంలో చంద్రబాబు శంఖారావం సభకు ముమ్మర ఏర్పాట్లు
- కనిగిరిలో బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న తెలుగు మహిళలు



శంఖారావం సభా ప్రాంగణానికి భూమి పూజ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బాలాజీ, ఉగ్ర, టీడీపీ నేతలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

పేరుకు ఎన్నికల శంఖారావం అయినా జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న ప్రాజెక్టుల సాధన, వైసీపీ ప్రభుత్వ వైఫల్యం, భవిష్యత్తులో టీడీపీ, జనసేన ప్రభుత్వం సాధించబోయే అంశాలను ప్రధానంగా చేసుకుని తెలుగుదేశం పార్టీ కనిగిరి సభకు సన్నాహాలు చేస్తోంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు శుక్రవారం కనిగిరిలో జరిగే బహిరంగసభలో పాల్గొంటున్న విషయం తెలిసిందే. 'రా.. కదలిరా' అంటూ రాష్ట్రంలోని 25 పార్లమెంట్ స్థానాల్లో ఒక్కో సభను నిర్వహించాలని బాబు నిర్ణయించారు. ఆ కార్యక్రమానికి శుక్రవారం కనిగిరిలో శ్రీకారం పలుకుతున్నారు. డాక్టరు ఉగ్రనరసింహారెడ్డి గత ఐదేళ్లుగా పార్టీ కార్యక్రమాల నిర్వహణలోనూ, ప్రజాసంబంధాల్లోనూ అగ్రభాగంలో నిలిచారు. ఏడాదిగా అన్నా క్యాంటీన్ నిర్వహణ ద్వారా అశేష ప్రజాదరణ పొందారు. వైద్యసేవా కార్యక్రమాల్లో ముందున్నారు. తద్వారా బాబు, లోకేష్‌లను ప్రత్యేకంగా ఆకర్షించిన డాక్టరు ఉగ్ర ప్రాతినిధ్యం వహించే కనిగిరి నుంచి ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభిస్తుండటం విశేషం.

వెలిగొండే ముఖ్యాంశం

జిల్లాలోని పశ్చిమప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగా సభా ప్రాంగణానికి 'వెలిగొండ ప్రాజెక్టు సాధన' పేరు పెట్టాలని ఉగ్ర అధిష్ఠానానికి సూచించారు. పరిశీలన అనంతరం ఆ పేరును అధిష్ఠానం ఖరారుచేసింది. అంతేగాక ఒంగోలు లోక్‌సభ పరిధిలోని ఆయా సాగు, తాగునీటి పథకాల విషయంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఈ సందర్భంగా ఎండగట్టాలని టీడీపీ నిర్ణయించుకుంది. అదేసమయంలో సభకు భారీగా జనాలను సమీకరించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నారు. కనిగిరి నియోజకవర్గంలో డాక్టరు ఉగ్ర ప్రచారం చేపట్టారు. నగర పంచాయతీలో తెలుగు మహిళలు ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్నారు. అలాగే ఆయా మండలాల వారీ నాయకులు ప్రతి గ్రామానికి వెళ్లి పార్టీ నాయకులతో సమావేశమై సభకు తరలిరావాలని సూచిస్తున్నారు. కనీసం 50వేల మందికి పైగా కనిగిరి నియోజకవర్గం నుంచే హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్దఎత్తున జనం తరలి వచ్చే అవకాశం ఉంది. టీడీపీ పరంగా కూడా ఆయా నియోజకవర్గాల వారీ పరిశీలకులను పంపి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మంగళవారమే దర్శిలో పత్తిపాటి పుల్లారావు, నారపుశెట్టి పాపారావు టీడీపీ శ్రేణులతో సమావేశం కాగా.. జనసేన కార్యకర్తలతో ఆపార్టీ నాయకుడు వెంకట్ సమావేశమై బాబు సభను జయప్రదం చేయాలని కోరారు. వైపాలెంలో ఎరిక్షన్‌బాబు, ఒంగోలులో దామచర్ల జనార్దన్, కొండపిలో ఎమ్మెల్యే స్వామి, గిద్దలూరులో అశోక్‌రెడ్డి, మార్కాపురంలో నారాయణరెడ్డిలు ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించి కనిగిరి సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కనిగిరికి సమీపంలోనే ఉన్నందున కందుకూరు నుంచి ఇంటూరి నాగేశ్వరరావు కూడా భారీగా శ్రేణులతో తరలివచ్చే ప్రయత్నాల్లో ఉన్నారు. దీంతో అంచనాలకు మించి ప్రజలు సభకు హాజరుకావచ్చని భావిస్తున్నారు. మిత్రపక్షమైన జనసేనకు కూడా కార్యక్రమానికి రావాలని టీడీపీ నాయకులు ఆహ్వానం పలికారు.

పోటీ చేయాలా.. వద్దా?

సమాలోచనల్లో శిద్దా, ఆయన కుమారుడు

- కుటుంబ సభ్యులు, సన్నిహితులతో విస్తృత చర్చలు
- అత్యధికుల నుంచి వ్యక్తంకాని సానుకూలత
- రేపు సీఎంకు తుది నిర్ణయం చెప్పే అవకాశం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేయాలా? వద్దా? అన్న అంశంపై మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఆయన కుమారుడు సుధీర్ ముమ్మర సమాలోచనల్లో మునిగిపోయారు. వైసీపీ అభ్యర్థిగా ఒంగోలు అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేయాలని సుధీర్‌ను సీఎం జగన్ ఆదేశించడం, ఆలోచించుకుని రెండు రోజుల్లో నిర్ణయం చెబుతామని రాఘవరావు, సుధీర్ చెప్పి రావడం విదితమే. దీంతో వారిద్దరూ రెండురోజులుగా ఇటు కుటుంబ సభ్యులు, అటు సన్నిహితులు, శ్రేయోభిలాషులతో సమావేశమై అందరి అభిప్రాయం తెలుసుకుంటున్నారు. అయితే ఇప్పటివరకూ అందిన సమాచారం ప్రకారం అత్యధికులు 'మీరు రిస్కుచేయడం అనవసరం' అన్న అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతో పోటీచేసే అభ్యర్థులను సీఎం జగన్ మారుస్తున్నారు. అందులో భాగంగా ఒంగోలు సిటింగ్ ఎమ్మెల్యే బాలినేని పేరును గిద్దలూరుకు పరిశీలిస్తున్నారు. ఆయన స్థానంలో ఒంగోలు నుంచి శిద్దా సుధీర్‌ను పోటీచేయాలని కోరారు. దీంతో శిద్దా కుటుంబం డైలమాలో పడిపోయింది. పోటీ విషయమై మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమైన వారి సమాలోచనలు బుధవారం కూడా కొనసాగాయి. కుటుంబసభ్యుల్లో ముఖ్యులందరి అభిప్రాయం తెలుసుకునే ప్రయత్నం చేశారు. పార్టీలకతీతంగా ఉన్న సన్నిహితులు, శ్రేయోభిలాషులను కూడా నేరుగా, ఫోన్లలో సంప్రదించారు. శుక్రవారం నిర్ణయాన్ని సీఎంకు తెలియజేసే ఉద్దేశంతో వారు ఉన్నారు. అందిన సమాచారం మేరకు రాష్ట్రంలో వాతావరణం అధికారపార్టీకి సానుకూలంగా లేదని ఎక్కువ మంది చెప్పినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో మీరు రిస్క్ చేయాల్సిన అవసరం లేదని అత్యధికులు సూటిగా చెప్పారు. అయితే రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉందన్న భావనతో శిద్దా, ఆయన కుమారుడు ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వారు ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న విషయంలో ఇబ్బందిపడుతున్నట్లు తెలిసింది.

మాగుంట పేరు ప్రస్తావించని సీఎం

సీఎం మంగళవారం రాఘవరావు, సుధీర్‌తోపాటు చంద్రశేఖర్‌తో మాట్లాడేటప్పుడు కూడా ఎంపీ మాగుంట పేరును ఒక్కసారి కూడా ఉచ్చరించలేదని తెలిసింది. ఎంపీ అభ్యర్థి విషయం ఒకసారి ప్రస్తావనకు రాగా 'రెడ్డి సామాజికవర్గానికి అవకాశం ఇస్తాం. సత్యనారాయణ రెడ్డి (రెడ్డి కార్పొరేషన్ చైర్మన్) లాంటి వారు చాలామంది పోటీకోసం సిద్ధంగా ఉన్నారు' అని వ్యాఖ్యానించినట్లు సమాచారం. అడపాదడపా వైవీ సుబ్బారెడ్డి పేరును చెబుతుండటం వైసీపీ నాయకుల్లో చర్చనీయాంశమైంది. ఒంగోలుకు సుదూరంగా ఉన్న గిద్దలూరులో బాలినేని పోటీ చేసి ఎంపీగా మాగుంట కూడా లేనప్పుడు మనకు ఇక్కడ పోటీచేయడం అవసరమా అని శిద్దా కుటుంబానికి బంధువర్గం నుంచి సూచనలు అందినట్లు తెలిసింది.

ఎదురొచ్చిన మృత్యువు



- రోడ్డుప్రమాదంలో కంభంకు చెందిన తండ్రీకొడుకు మృతి
- మోటారు సైకిల్‌ను కారు ఢీకొనడంతో దుర్ఘటన

వివరాలు లోపలి పేజీల్లో..

కొత్తపట్నం ఎంపీడీవోపై విచారణ

• ఉపాధి హామీ పనుల్లో అవకతవకల మీద ఫిర్యాదు

కొత్తపట్నం(ఒంగోలునగరం), జనవరి 3: కొత్తపట్నం ఎంపీడీవో డాక్టర్ సుజాతపై బుధవారం విచారణ జరిగింది. డ్వామా ఏపీడీ వెంకటస్వామి విచారణ చేపట్టారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయంటూ కొత్తపట్నం ఎంపీటీసీ రామలింగం వెంకటరావు చేసిన ఫిర్యాదు మేరకు ఆమెపై అధికారులు విచారణ చేపట్టారు.మండలంలో అధికంగా ఇసుక నేలలు ఉండగా ఆ నేలలో నీటి చెరువులు తవ్వినట్లు చూపించి కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో జరగాల్సిన పనులను నిబంధనలకు విరుద్ధంగా వారికి తెలియకుండానే పనులు చేసినట్లు చూపించి నిధులు దిగమింగారని అందిన ఫిర్యాదుపై విచారణ జరిగింది. ఈ అవకతవకల్లో ఎంపీడీవో పాత్రే కీలకంగా ఉందని అందిన ఫిర్యాదుపై విచారణ జరిగింది. ఈ విచారణకు ఫిర్యాదుదారుడు రామలింగం వెంకట్రావు హాజరయ్యారు. విచారణ అధికారి పలుకోణాల్లో విచారణ జరిపినట్లు తెలుస్తోంది.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి : ఎస్పీ

ఒంగోలు(క్రైం), జనవరి3: రానున్న సారవత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధంగా ఉండాలని ఎస్పీ మలికగర్గ్ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని పోలీసు కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఎస్పీ గత ఎన్నికల్లో జరిగిన కేసులపై సమీక్ష చేశారు. సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్‌ల వివరాల గురిచి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు శాంతియుతంగా నిర్వహిచేందుకు ప్రణాళికబద్దంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికలలో సమస్యలను సృష్టించే వారిని గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎస్‌వీ.శ్రీధర్‌రావు, ఎస్బీ డీఎస్పీ మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

లీజుకు టూరిజం రెస్టారెంట్

ఒంగోలు నగరం, జనవరి 3: కురిచేడు మండలం చందవరంలోని ప్రసిద్ధ బౌద్ధక్షేత్రంలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్మించిన రెస్టారెంట్‌ను లీజుకు ఇచ్చేందుకు కార్పొరేషన్ నిర్ణయించిందని జిల్లా టూరిజం అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లీజుకు తీసుకునేందుకు ఆసక్తి ఉన్న వారు విజయవాడలోని పర్యాటకశాఖ జోనల్ మేనేజర్ వారిని 9640007182, జిల్లా పర్యాటక అధికారి 9121144102 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణను వేగవంతం చేయాలి : జేసీ



రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

మర్రిపూడి, జనవరి 3 : మండలంలో అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎలాంటి అవకతవకలకు చోటులేకుండా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. అర్హులైన భూయజమానులను గుర్తించడంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రికార్డులను భూమి యజమానుల వద్ద ఉన్న ఆధారాలతో సరిపోల్చుకొని జాబితాలను త్వరితగతిన సిద్ధం చేయాలని కోరారు. అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు ఆయన గుళ్లసముద్రం పంచాయతీ పరిధిలోని 121 సర్వే నంబరులో మైనింగ్ లీజు కోసం వచ్చిన ప్రతిపాదిత భూమిని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.హరిబాబు, డీటీ కేఆర్ భూపతి, ఆర్ఐ రమణ, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు సర్వే



సర్వే నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

సింగరాయకొండ, జనవరి 3 : మండలంలోని శానంపూడిలో బుధవారం కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వే చేపట్టారు. పారామెడికల్ అధికారి దామా వెంకటేశ్వర్లు వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించారు. శరీరం మీద రాగి రంగు మచ్చలు, కనురెప్పల మీద వెంట్రుకలు రాలిపోతున్నా, చెవుల తమ్మెల మీద బుడిపెలు ఉన్నా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సాంబశివరావు, ఆరోగ్యపర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌అలీ, రాజమ్మ, ఏఎన్ఎం సాయిశ్రీ పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకురాలు మృతి

మర్లపాడు (టంగుటూరు) జనవరి 3 : మండలంలోని మర్లపాడు గ్రామ రెవెన్యూ సహాయకురాలు దేవరపల్లి కోటేశ్వరమ్మ (70) బుధవారం మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్, వీఆర్‌వో జోషి సందర్శించి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల కోసం కొంతనగదు అందజేశారు.

ఒంగోలు జేఎంబీ చర్చిలో ఘర్షణ



గొడవపడుతున్న ఇరువర్గాలు

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 3: ఒంగోలులోని జేఎంబీ చర్చిలో స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎన్నిక విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. బుధవారం చర్చి ఆవరణంలో జరిగిన సమావేశంలో కమిటీ సభ్యుల ఎన్నిక జరగ్గా ఇరు వర్గాల మధ్య వివాదం రేగింది. సభ్యుల నియామకానికి మూడు క్రైస్తవపాళెలంలకు ఖాళీ ఏర్పడగా, కొత్తవారిని నియమించే విషయాన్ని సమావేశంలో చర్చకు తీసుకు వచ్చారు. ఇందుకు సంబంధించి చర్చి సభ్యులు ఆమోదంతో ఓటింగ్ నిర్వహించారు. క్లౌపేట నుంచి వై.అరుణ్ ధీరజ్, దండుపాలెంకు చెందిన బి. పీటర్, తూర్పుక్రిస్టియన్ పాలెంకు చెందిన కె.సోమయాజులను ఎన్నుకున్నారు. అయితే క్లౌపేట నుంచి వినోద్ కూడా పోటీలో నిలిచారు. అయితే వై.అరుణ్ ధీరజ్ ఎన్నిక చెల్లదని వినోద్ వర్గం అభ్యంతరం తెలిపింది. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకోవడంతో టూటౌన్ సీఐ జగదీష్ తన సిబ్బందితో అక్కడకు చేరుకుని ఇరు వర్గాలతో మాట్లాడారు. అనంతరం గొడవకు దారితీసిన కారణాలపై విచారించిన ఆయన కమిటీ ఎన్నికను వాయిదా వేసి ఇరు వర్గాలను పంపివేశారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయాలి





క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులతో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్, హాజరైన నాయకులు

• టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 3 : కనిగిరిలో ఈనెల 5వ తేదీన జరిగే చంద్రబాబునాయుడు శంఖారావం సభను విజయంతం చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. బుధవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు సంబంధించి పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన శంఖారావం జిల్లా నుంచి మొదలు పెట్టడం శుభ పరిణామమని చెప్పారు. ఈ సభ గతంలో ఒంగోలులో జరిగిన మహానాడు కంటే మరింత విజయం చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు విసుగు చెంది ఉన్నారని తెలిపారు. వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతోపాటు, గతంలో తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. అనంతరం ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయకుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయం ఆసన్నమైనందున కార్యకర్తలు అందరు కష్టపడి పనిచేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, మాజీ మునిసిపల్ ఛైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు కపిల్‌బాషా, పాలూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు

• కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 3: త్వరలో జరగనున్న పార్లమెంట్, శాసనసభ సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ న్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం సాయంత్రం రాజకీయపార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి ఒంగోలులో ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూముల పరిశీలన చేసినట్లు చెప్పారు. జిల్లాకు సంబంధించి అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చెక్‌పోస్టుల ఏర్పాటుకు పోలీస్ అధికారులతో చర్చించి ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గాల వారీగా వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎంల విభజన జరుగుతుందన్నారు. ఈనెల 22వతేదీన ఓటర్ల తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అంతకు ముందు రాజకీయ పార్టీల నాయకులు పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో ఆర్.శ్రీలత, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఈఆర్వోలు, రాజకీయపార్టీల ప్రతినిధులు డీఎస్.క్రాంతికుమార్, రసూల్, గుర్రం సత్యం, రఘురాం, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్, కౌంటింగ్ రూముల ఏర్పాటుపై దృష్టి

వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రం ఏర్పాటుకు కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టి సారించారు. బుధవారం సాయంత్రం ఎస్పీ మలికగర్గ్‌తో కలిసి స్థానిక రైజ్ ఇంజనీరింగ్ కాలేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇక్కడ స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినందున ఈ సారి కూడా అక్కడ ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించినట్లు తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్, నిర్వహకులతో ఆయా విషయాలపై కలెక్టర్, ఎస్పీలు చర్చించారు. పోలింగ్ కేంద్రాల నుంచి ఇక్కడికి దూరం, ఈవీఎంల తరలింపునకు ఉన్న రవాణా మార్గం, ఈ ప్రాంగణంలోకి ప్రవేశం, భద్రత తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉందన్నారు. త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఆర్.శ్రీలత, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, ఒంగోలు, టంగుటూరు తహసీల్దార్లు మురళీ, సంజీవరావు, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

జేఏసీ నాయకుల డిమాండ్ • దీక్షకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల మద్దతు



నిరసన దీక్షలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 3 : సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పలువురు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గత పక్షం రోజుల నుంచి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యోగ భద్రతతో పాటు హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఫెడరేషన్(జేఏసీ) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు 15 వరోజైన బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పది లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు గ్రాట్యుటీ కల్పించాలన్నారు. ఉద్యోగులకు సామాజిక భద్రత పథకాలు, ఈసీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, పదవీ విరమణ వయస్సును పెంచాలన్నారు. సీఆర్ఎంటీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, మండల లెవల్ అకౌంటెంట్స్, మెసెంజర్స్, ఆర్ట్, పీఈటీ, సైట్ ఇంజనీర్స్, కేజీబీవీస్కూల్ టీచింగ్, నాన్ టీచింగ్ ఖాళీ పోస్టులను భర్తీ చేసి పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కాగా సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షా శిబారాన్ని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉద్యోగులు కొత్తగా ఏమీ హామీలు కోరడం లేదని, ఇచ్చిన హామీలను అడుగుతున్నా పట్టించుకోలేదని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, కళ్యాణి పాల్గొన్నారు.

పంతుళ్ల పోరుబాట ఉధృతం

• యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహాధర్నా



ధర్నాలో పాల్గొన్న టీచర్లు

ఒంగోలు(విద్య), జనవరి 3 : ప్రభుత్వ మెడలు వంచి రావాల్సిన ఆర్థిక బకాయిలు సాధించేందుకు ఉపాధ్యాయులు పోరుబాటను ఉధృతం చేశారు. ప్రతినెల ఒకటో తేదీనే పింఛన్లు చెల్లించాలని, డీఏ బకాయిలు, పీఆర్సీ అరియర్స్, పీఎఫ్‌లోన్లు, ఏపీజీఎల్ఐ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట మహాధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్లు నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు జీతాలు, పింఛన్లు చెల్లింపు, బకాయిల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై మండిపడ్డారు. యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ బకాయిలు ఇతర బకాయిలు రూ.12వేల కోట్లు, సరెండర్ లీవుల బకాయిలు రూ.4500 కోట్లు ఇంతవరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు రూ.1500 కోట్లు కాగా ప్రభుత్వం చెల్లించలేదని విమర్శించారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో అన్ని రకాల బకాయిలు సెప్టెంబరు ఆఖరు నాటికి చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం మాటతప్పిందని ఆయన దుయ్యబట్టారు. బకాయిలు, జీతాలు, పింఛన్లు చెల్లింపులో ప్రభుత్వ వైఖరి మారకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. యూటీఎఫ్ పోరుబాటలో భాగంగా జిల్లా సహాధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై తలకిందులుగా నిలబడి నిరసన తెలిపారు. కాగా మహాధర్నాను మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రవి, డి.వీరాంజనేయులు, లక్ష్మీనారాయణ, చిన్నస్వామి, ఎన్‌వీ.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే పోరుబాటును ఉధృతం చేస్తామని ఏకగ్రీవంగా నిర్ణయించారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

• నివాళులర్పిస్తున్న పలు సంఘాల ప్రతినిధులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 3: దేశంలో మహిళల అక్షరాస్యత కోసం నిరంతరం కృషి చేసిన మహామనిషి సావిత్రిబాయి పూలే అని పలువురు కొనియాడారు. ఒంగోలులోని దేవుడి చెరువులోని గల వేదిక ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం సావిత్రిబయి పూలే జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె



సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వేదిక ఫౌండేషన్ నిర్వాహకులు


చిత్రపటానికి ఫౌండేషన్ అధ్యక్షురాలు షేక్ సిద్దాంబి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిద్దాంబి ప్రసంగిస్తూ నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ మహిళలు సైతం చదువుకోవాలనే ఆశయంతో దేశంలోనే మొదటిసారిగా పూణేలో బాలికల పాఠశాలను సావిత్రబాయి ప్రారంభించారన్నారు. మహిళల హక్కుల కోసం తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి ఆమె పోరాటం చేశారని చెప్పారు. ఆలిండియా కళారంగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ మాట్లాడుతూ ఆధునిక భారతదేశంలో స్త్రీ విద్యాభివృద్ధికి కృషిచేసిన తొలితరం మహిళ అని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు జి.గురవారెడ్డి, తమ్మిశెట్టి రమాదేవి, ఎస్‌డీ.ఇస్మాయిల్, పత్రా శివ, సుబ్బారావు, శ్రీదేవి, కోటేశ్వరరావు, ఆళ్ల భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రముఖ ఉపాధ్యాయిని, నరసం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మున్నంగి రాజకుమారిని వారు ఘనంగా సత్కరించారు.

పలు సంస్థల ఆధ్వర్యంలో..

ఒంగోలు(కలెక్టరేట్): సంఘసంస్కర్త, మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలేని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని బీజేపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ.యోగయ్యయాదవ్ పిలుపునిచ్చారు. ఒంగోలు నగరం రామనగర్‌లో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వితంతువులు, స్త్రీలు, అనాథ బాలబాలికలను ఆదరించి వారికి విద్యాబుద్దులు నేర్పించి వారిని ప్రయోజకులను చేసిన గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శెగ్గెం శ్రీనివాసులు, డి.శివాజీ, ఎ.సంజీవకుమార్, పి.తిరుమలరావు, రాంబాబు, కిలారు రవి, సన్నిపోగు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

- ఇండిపెండెంట్ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లోని సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అంజమ్మ, రమేష్, దాసరి కోటమ్మ పాల్గొన్నారు.

- సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచి పుస్తకం షాపు వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు చుండూరి రంగారావు, బి.సుబ్బారావు, కరువది సుబ్బారావు, తోరటి ఆనంద్, దాసరి సుందరం, ధరణికోట లక్ష్మీనారాయణ, పీవీ.సుబ్బారావు, ఎం.జార్జి, తన్నీరు ఆంజనేయులు, బెల్లంకొండ అశోక్, అద్దంకి వెంకట్రావు, ఎం.క్రాంతి, శిరీష, హరికృష్ణ, పేరయ్య, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

సింగరాయకొండలో..

సింగరాయకొండ: తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే జయంతిని స్థానిక పీఎన్‌సీఏ డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీఎన్‌సీఏ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.గీతారాణి మాట్లాడుతూ అందరూ చదవాలి.. సమానంగా ఎదగాలి అని పరితపించి సామాజిక విప్లవ స్ఫూర్తిని రగిల్చిన మహోన్నత వ్యక్తి సాయిత్రిబాయి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

20న నవోదయ ప్రవేశపరీక్ష

ఒంగోలు(విద్య), జనవరి 3: ఒంగోలు జవహర్‌నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి ఈనెల 20న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి బుధవారం తెలిపారు. ఈనెల 10వతేదీ వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారు ఆన్‌లైన్ ద్వారానే హాల్ టిక్కెట్లు పొందాలన్నారు. ఒంగోలు నవోదయ ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తు చేసినవారు ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి హాల్‌టిక్కెట్లు 10వ తేదీ వరకు కార్యాలయాల పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హాల్ టిక్కెట్లు పొందవచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం 9481837230, 8638682701 సెల్ నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు శంకర బాలభక్త సమాజ భవన భూమిపూజ

ఒంగోలు(కల్చరల్), జనవరి 3: ఒంగోలు నగరం ఇలింద్రవారి వీధిలోని శ్రీ శంకర బాలభక్త సమాజం ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణానికి గురువారం ఉదయం 8.15 గంటలకు భూమిపూజ నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న భవనం ముందు భాగంలో నూతన భవన నిర్మాణానికి భూమిపూజ జరుగుతుందని, కనుక భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

7న సుదర్శన లక్ష్మీ నారసింహ యజ్ఞం

ఒంగోలు(కల్చరల్), జనవరి 3: ఒంగోలు నగరం గడియారంవారి వీధిలోని శ్రీ సిద్దేశ్వరి పీఠపాలిత బ్రాహ్మణ సేవాసమతి నిర్వహణలోని శ్రీఅనంతకోదండ రామస్వామి దేవస్థానంలో 7వ తేదీన ఉదయం 14వ వార్షిక శ్రీ సుదర్శన లక్ష్మీ నారసింహ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన నిర్వాహకులు గడియారం సుబ్బయ్య శర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ సలహాదారులు కళ్యాణపురం రాజేష్‌కుమార్‌భట్టార్ బృందం ఆధ్వర్యంలో ఈ యజ్ఞం జరుగుతుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ యజ్ఞంలో పాల్గొనదలచిన వారు నిర్వాహకులను సంప్రదించాలని ఆయన కోరారు.

పేస్ విద్యార్థుల ప్రతిభ



క్యాడెట్లను అభినందిస్తున్న శ్రీధర్

ఒంగోలు(విద్య), జనవరి 3 : ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ఐదుగురు గత నెల 22నుంచి 29వ తేదీ వరకు జరిగిన ఆలిండియా ట్రెక్కింగ్‌లో పాల్గొన్నారు. కేరళ, లక్షద్వీప్ ఎన్‌సీసీ డైరెక్టర్ ఆధ్వర్యంలో జెన్సికుల మావులో జరిగిన ఆలిండియా క్యాంపులో పాల్గొని వీరు ప్రతి రోజు 7నుంచి 9 కిలోమీటర్లు పర్వత శ్రేణులను అధిరోహించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థుల ప్రదర్శనలకు బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ట్రెక్కింగ్‌లో పాల్గొన్న విద్యార్థులను కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ ఆర్.వీరాంజనేయులు, డిప్లొమో ప్రిన్సిపాల్ కోటిరెడ్డి, బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ కె.సత్యనారాయణ, ఎన్‌సీసీ ఆఫీసర్ పృథ్వికృష్ణ, పీడీ ఐ.మధుసూదనరావు అభినందించారు.

ఏసీ, ఫ్రిజ్ రిపేర్లపై ఉచిత శిక్షణ

ఒంగోలునగరం, జనవరి 3: రూడ్‌సెట్ ద్వారా ఈనెల 18వ తేదీ నుంచి ఏసీ, ఫ్రిజ్ రిపేర్లపై ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ఒంగోలులోని రూడ్‌సెట్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. అభ్యర్థులు 19 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు వారు ఈ శిక్షణను వినియోగించుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం ఉంటుందని, పూర్తి వివరాలకు 9573363141 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

హైదరీ క్లబ్‌లో కరాటే శిక్షణ కేంద్రం ప్రారంభం

ఒంగోలు (కార్పొరేషన్) జనవరి 3 : ఒంగోలులోని హైదరీ క్లబ్‌లో నూతనంగా కరాటే శిక్ష కేంద్రాన్ని ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 6-30 నుంచి 7-30 గంటల వరకు, అలాగే సాయంత్రం 5-30 గంటల నుంచి 7 గంటల వరకు కరాటేలో శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీప్రతిభ విద్యాసంస్థల ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వరరావు, క్లబ్ ప్రధాన కార్యదర్శి గుండవరపు రాఘవరావు, మారెళ్ళ సుబ్బారావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

ఒంగోలు(కల్చరల్), జనవరి 3: ఒంగోలు నగరం సుజాతనగర్ 11వ లైనులోని అపెక్స్ హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్కూలు కరస్పాండెంట్ కె.శివకోటి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో మందాడి శ్రీనివాస రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించే ఈ వైద్య శిబిరంలో కంటి, స్త్రీల, జనరల్ వైద్య నిపుణులు పాల్గొని పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేస్తారని, విద్యార్థుల కోసం నిర్వహించే ఈ శిబిరంలో వారి తల్లిదండ్రులు సైతం పాల్గొని పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. కనుక ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

స్కౌట్ ఉద్యమాన్ని బలోపేతం చేయాలి : డీఈవో

ఒంగోలు(విద్య), జనవరి 3: జిల్లాలో స్కౌట్ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి వీఎస్.సుబ్బారావు పిలుపునిచ్చారు. ఒంగోలులోని సమగ్రశిక్ష కార్యాలయంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బేసిక్ కోర్స్ వెంటనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్కౌట్ ద్వారా విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెరిగి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దేందుకు స్కౌట్ ఉద్యమం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎ.సుబ్బారావు, పరిశీలకులు నాగిరెడ్డి, ఏఎస్‌వో టి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, డిస్ట్రిక్ చీఫ్ కమిషనర్‌గా డీఈవో సుబ్బారావు, జిల్లా కార్యదర్శిగా టి.బాలాజీ, కోశాధికారి పర్రె వెంకట్రావు, డిస్ట్రిక్ కమిషనర్‌గా బి.హెప్సీనా, ఆర్గనైజింగ్ కమిషనర్లుగా వై.కోటేశ్వరరావు, బి.రమాదేవి, కేవీ.శేషారావు, సీహెచ్.వాసంతిలను ఎన్నుకున్నారు.

రేపు టంగుటూరులో పింఛన్ల పంపిణీ

• హాజరుకానున్న మంత్రి సురేష్

టంగుటూరు, జనవరి 3: మండలంలో పింఛన్‌ల పంపిణీ శుక్రవారం జరగనుంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఇప్పటి వరకూ నెలకు రూ.2,750 ఇస్తున్న పింఛన్ సొమ్మును ప్రభుత్వం ఈనెల నుంచి రూ.3000కు పెంచింది. మండలానికి కొత్తగా 129 పింఛన్‌లు మంజూరు చేసింది. కొత్తవి, పాతవి కలిపి ఇవ్వనున్నారు. వైసీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఇటీవల నియమితులైన సురేష్ తొలిసారి టంగుటూరు రానున్నారు.

12న పండ్ల మొక్కల పంపణీ

టంగుటూరు, జనవరి 3 : మండలంలోని కారుమంచిలో ఈనెల 12న ఇంటింటికీ పండ్ల మొక్కలు పంపిణీ చేయనున్నట్లు మాఊరు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. ప్రముఖ వ్యాపారవేత్త ఉన్నం పార్థసారథి ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

స్వామిత్ర సర్వే పరిశీలన



మ్యాప్ పరిశీలిస్తున్న డీపీవో నారాయణరెడ్డి

ఒంగోలు(రూరల్), జనవరి 3: ఒంగోలు మండలం యరజర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం స్వామిత్వ సర్వే మ్యాప్‌ను డీపీవో జీవీ.నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సర్వే త్వరగా పూర్తి చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

దశరాజుపల్లిలో పింఛన్లు పంపిణీ



పింఛను అందజేస్తున్న సర్పంచ్

ఒంగోలు(రూరల్), జనవరి3: దశరాజుపల్లి పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ పులిచర్ల శ్రీలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.అజిత, ఈవోఆర్డీ వెంకటరమణమ్మ, పంచాయతీ కార్యదర్శి రేవతి పాల్గొన్నారు.



మృతి చెందిన కుమారుడు శివఫణీంద్రకుమార్, తండ్రి బుజ్జి

రోడ్డుప్రమాదంలో తండ్రీకొడుకు మృతి

» ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో దుర్ఘటన

మార్కాపురం రూరల్, జనవరి 3: బైకును కారు ఢీకొట్టిన ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం మండలంలోని తిప్పాయపాలెం, జంగంగుంట్ల మధ్య జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కంభంకు చెందిన సొరకాయల బుజ్జి (35) కారు డ్రైవర్. ఆయన పెద్ద కుమారుడు శివఫణీంద్రకుమార్ (10)కి అనారోగ్యంగా ఉండటంతో బైక్‌పై మార్కాపురంలోని ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యుడికి చూపించుని తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. తిప్పాయపాలెం, జంగంగుంట్ల గ్రామాల మధ్యకు వచ్చే సరికి ఎదురు వేగంగా వచ్చిన కారు వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తండ్రీకొడుకులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. బుజ్జికి భార్య మరో కుమారుడు ఉన్నారు. మృతిచెందిన పెద్దకుమారుడు శివఫణీంద్ర 3వ తరగతి చదువుతున్నాడు. తండ్రీకొడుకుల మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని మార్కాపురం రూరల్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

చంద్రబాబు సభను జయప్రదం చేయాలి

● కార్యక్రమ పరిశీలకుడు హరిబాబు



మాట్లాడుతున్న పరిశీలకుడు హరిబాబునాయుడు

కొండపి, జనవరి 3 : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈనెల 5న కనిగిరిలో నిర్వహిస్తున్న ఎన్నికల శంఖారావ సభను జయప్రదం చేయాలని కార్యక్రమ మండల పరిశీలకుడు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వడ్రాణం హరిబాబు నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి కొండపిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారన్నారు. యువత, మహిళల భవిష్యత్ కోసం, జగన్ కబంధ హస్తాల నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరినీ కార్యోన్ముఖులను చేసేందుకు చంద్రబాబు సభ నిర్వహిస్తున్నారన్నారు. పార్టీ కొండపి నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు మాట్లాడుతూ కనిగిరి సభకు నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై జయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బత్తుల నారాయణస్వామి, చాగంరెడ్డి నరసారెడ్డి, గుండపనేని రామూర్తినాయుడు, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, బూదవాటి సోమయ్య, దేపూరి సుబ్బారావు, తెలుగు యువత నాయకుడు దేపూరి మస్తాన్, రాజారపు బ్రహ్మానందం పాల్గొన్నారు.

అవ్వ, తాతలను మోసం చేసిన జగన్

సొంత చెల్లి, తల్లి, ఎమ్మెల్యేలనే ముంచారు
మాటివ్వడం, మడమ తిప్పడం ఆయన నైజం
ఎమ్మెల్యే స్వామి ఘాటు విమర్శలు



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, జనవరి 3 : అధికారంలోకి వచ్చిన వెంటనే అవ్వ, తాతలకు ఇచ్చే పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచుతానని మాటిచ్చి మడమతిప్పిన మోసగాడు జగన్ అని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి విమర్శించారు. సొంత చెల్లి, తల్లి, పార్టీని నమ్ముకున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులను ముంచినట్లు పింఛన్‌దారులను కూడా మోసం చేశారని ఆయన ధ్వజమెత్తారు. బుధవారం రాత్రి స్థానిక పంచాయతీ పరిధిలోని మదీనాస్ట్రీట్‌లో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో స్వామి పాల్గొని మాట్లాడారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులకు రూ.200, దివ్యాంగులకు రూ.500 పింఛన్ ఇస్తుండగా టీడీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం రూ.1000, దివ్యాంగులకు రూ.1500 చేశామన్నారు. ఆతరువాత మరలా వృద్ధాప్య, వితంతు పింఛన్లను రూ.2వేలకు పెంచామని స్వామి గుర్తు చేశారు. సమాజంలో వివక్షకు గురవుతున్న ట్రాన్స్‌జెండర్లకు కూడా పింఛన్ సౌకర్యం కల్పించి వారిని ఆదుకున్న పార్టీ తెలుగుదేశమేనన్నారు. రూ.200 ఉన్న సామాజిక పింఛన్‌ను రూ.2వేలకు పెంచిన ఘనత చంద్రబాబుదేనన్నారు. అయితే టీడీపీ ఇచ్చింది రూ.1000 అని జగన్‌రెడ్డి ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ రూ.3 వేలు చేస్తానని కల్లబొల్లి మాటలుచెప్పి ముఖ్యమంత్రి అయిన తరువాత తొలుత రూ.2వేల నుంచి రూ.2,250 పెంచి మాటతప్పారని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు రెండు నెలల ముందు విడతల వారీగా పెంచుకుంటూ వచ్చి రూ.3వేలు ఇచ్చామని కట్టుకథలు చెబుతున్నారని స్వామి ధ్వజమెత్తారు. టీడీపీ ఐదేళ్లపాలనలో 19 లక్షల మందికి కొత్తగా పింఛన్లు ఇచ్చి సామాజిక భద్రత కల్పించామని తెలిపారు. వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో వయోపరిమితి సడలించినా 12 లక్షల మందికే ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం ఆపార్టీ నేతలకే చెల్లిందని దెప్పిపొడిచారు. దాదాపు 7 లక్షల పింఛన్లకు మంగళం పాడి లబ్ధిదారుల నోట్లో మన్నుకొట్టారని స్వామి మండిపడ్డారు. ఒకటో తేదీ ఇవ్వాల్సిన పింఛన్‌లను ప్రచారార్భాటం కోసం ఇప్పటి వరకూ ఇవ్వకుండా లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి అబద్ధాన్ని పదేపదే వల్లెవేసి తప్పుడు సమాచారంతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. సర్వేల పేరుతో ప్రజల్లో వ్యతిరేకత ఉందని పార్టీని నమ్ముకున్న ఎస్సీ, బీసీ ఎమ్మెల్యేలకు సీట్లు నిరాకరిస్తూ ఆసామాజిక వర్గాలను అణగదొక్కుతున్నారని స్వామి విరుచుకుపడ్డారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌రెడ్డినే మార్చడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం ఇంటింటికీ తిరిగి భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. అథోగతి పాలైన రాష్ట్రం మరలా అభివృద్ధి బాటలో పయనించాలంటే చంద్రబాబుకు అండగా నిలవాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలుచేసే సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు స్వామి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, చీమకుర్తి కృష్ణ, షేక్ సంధానీబాషా, సన్నెబోయిన శ్రీనివాసులు, కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, చిగురుపాటి గిరి, గుదే వెంకటేశ్వర్లు, మించల బ్రహ్మయ్య, బ్రహ్మేశ్వరరావు, అబ్దుల్ సుభాన్, యస్దాని, పసుపులేటి శేషారావు, కళ్లగుంట నరసింహ, సనావుల్లా, గౌస్, సాజీద్, మోటుపల్లి వెంకటేశ్వర్లు, శీలం చంటి, రవిశంకర్‌రెడ్డి, తుమ్మా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పోరు ఉద్రిక్తం

భారీగా తరలివచ్చి కలెక్టరేట్ ముట్టడి ● పలుమార్లు చొచ్చుకుపోయేందుకు యత్నం
పోలీసులు, కార్యకర్తలకు మధ్య తోపులాట ● ఆందోళనకు మద్దతు తెలిపిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల



అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు నగరం, జనవరి 3 : అంగన్‌వాడీలు కన్నెర్రజేశారు. ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. వేల సంఖ్యలో కార్యకర్తలు, ఆయాలు స్థానిక ప్రకాశంభవనంకు తరలివచ్చారు. దీంతో కలెక్టరేట్ ప్రాంతం కిక్కిరిసింది. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో దద్దరిల్లిపోయింది. ప్రకాశంభవన్ ఎదురు రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. 23 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోగా, వెంటనే విరమించకపోతే ఉద్యోగాలు ఊడుపోతాయంటూ ప్రభుత్వం అల్టిమేటం జారీచేయడంపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల ఆందోళన నేపథ్యంలో కలెక్టరేట్ ఎదుట పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి అంగన్‌వాడీలను నియంత్రించేందుకు ప్రయత్నించారు. కానీ పెద్ద సంఖ్యలో చేరుకున్న కార్యకర్తలు, ఆయాలు.. కలెక్టర్ బయటకు రావాలంటూ నినాదాలు చేశారు. కొంత సమయానికి ఐసీడీఎస్ పీడీ వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. వెంటనే విధుల్లో చేరాలని ఆమె కోరగా వేతనాలు పెంచే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీలు తేల్చిచెప్పారు. దీంతో ఆమె లోపలికి వెళ్లిపోయారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకుపోయేందుకు కార్యకర్తలు పలుమార్లు ప్రయత్నించారు. ఈ సందర్భంగా వారికి, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో పలువురికి గాయాలయ్యాయి. మధ్యాహ్నం మూడు గంటల వరకు కలెక్టరేట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. అనంతరం అంగన్‌వాడీలు ప్రదర్శనగా అద్దంకి బస్టాండ్ వరకు వెళ్లి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్‌రావు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలకు తమ మద్దతు తెలిపి వారినుద్దేశించి మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి రాగానే కార్యకర్తల డిమాండ్లను నెరవేరుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి కూడా అంగన్‌వాడీల ఆందోళనకు మద్దతు తెలియజేస్తూ మాట్లాడారు. అంగన్‌వాడీల యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నపూర్ణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తమ సత్తా చూపుతామన్నారు. అంగన్‌వాడీలను నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వాల గతే ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని ఆమె హెచ్చరించారు. ఆందోళనలో సీఐటీయూ నాయకులు జి.వి.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు కె.వి.సుబ్బమ్మ, ధనలక్ష్మి, శేషమ్మ, క్రాంతికుమారి, శోభారాణి పాల్గొన్నారు.

షర్మిల కాంగ్రెస్‌లో చేరినా.. వైసీపీకి నష్టం లేదు..!

మంగళగిరిలో బీసీలకు ఇవ్వడం కోసం ఆర్కేకు ఇవ్వలేదు
ఆర్కే మనస్తాపంతో బయటకు వెళ్తానంటే వెళ్లనివ్వండి..
ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నా..
పోటీచేసే నిర్ణయం సీఎం తీసుకుంటారు
టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 3: వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరినా తమ పార్టీకి ఎలాంటి నష్టం లేదని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ విశాఖ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు తమకు అండగా నిలబడతాయని, అత్యధిక స్థానాల్లో వైసీపీ విజయం సాధిస్తుందని తెలిపారు. ఒంగోలు నగరం లాయర్‌పేటలోని నివాసంలో బుధవారం తనను కలిసిన విలేఖరులతో ఆయన మాట్లాడారు. జగన్ మరోసారి సీఎం అవుతారన్నారు మంగళగిరిలో బీసీలకు టిక్కెట్ ఇవ్వడం కోసం ఆర్కేకు ఇవ్వలేదన్నారు. ఆర్కే మనస్తాపం చెంది బయటకు వెళ్తానంటే తమకు ఎలాంటి నష్టం లేదన్నారు. కొందరు వారి వ్యక్తిగత కారణాలతో బయటకు వెళ్తున్నారని, వెళ్లే వాళ్ల భవిష్యత్‌కు భరోసా ఇచ్చినా వెళ్తున్నారని తెలిపారు. జగన్ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఇప్పటికే 35 నియోజకవర్గాల్లో చేర్పులు, మార్పులు చేశామని ఈ ప్రక్రియ ఎన్నికల వరకు కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో గెలవాలని టార్గెట్‌గా పెట్టుకొని పనిచేస్తున్నామని తెలిపారు. తాను ప్రత్యక్ష రాజకీయాల్లోనే ఉన్నానని, ఎన్నికల్లో పోటీపై జగన్ నిర్ణయం తీసుకుంటారని వైవీ స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ ఒకరిపై ఒకరు ఎన్ని ఆరోపణలు చేసుకున్నారో అందరూ చూశారన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని వైవీ తెలిపారు.

పొలం తగాదాలో ఒకరిపై ఒకరు దాడి

వెలిగండ్ల, జనవరి 3 : పొలం విషయంలో ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు, అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగికి మధ్య సాక్షాత్తు తహసీల్దార్ ఎదుటే ఘర్షణ జరిగింది. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన సానికొమ్ము రమణారెడ్డి తన పేరు మీద ఉన్న సర్వే నెంబర్ 92-2లో 4 ఎకరాల భూమిని 2022 సంవత్సరంలో అప్పటి తహసీల్దార్ జ్వాలా నరసింహం అక్రమంగా మాదాల మాలకొండయ్య పేరు మీద ఆన్‌లైన్ చేశారని, దానిని తొలగించి న్యాయం చేయాలని గత నెల 22న వెలిగండ్లలో నిర్వహించిన స్పందనలో అర్జీ అందజేశాడు. ఈ విషయంపై తహసీల్దార్ వాసు ఇరువురిని కార్యాలయానికి పిలిపించారు. ఈ క్రమంలో మాదాల మాలకొండయ్య బంధువు కావడంతో ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడైన నాగుర్‌యాదవ్ కూడా కార్యాలయానికి వచ్చాడు. వివరాలు సేకరిస్తున్న సమయంలో సానికొమ్ము రమణారెడ్డి, నాగుర్‌యాదవ్‌లు ఒకరిపై ఒకరు తహసీల్దార్ ఎదుటనే దూషించుకుంటూ దాడిచేసుకున్నారు. ఇద్దరికీ గాయాలయ్యాయి. ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

కొనసాగుతున్న మునిసిపల్ కార్మికుల సమ్మె



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 3 : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన మునిసిపల్ కార్మికుల సమ్మె బుధవారం తొమ్మిదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఒంగోలులోని కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ధర్నానుద్దేశించి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలపై తొమ్మిది రోజులుగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అలాగే కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్న ప్రధాన డిమాండ్‌పై ప్రభుత్వం మూడు గంటలపాటు చర్చించినా ఫలితం లేదన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. మార్చి, ఏప్రిల్‌లో పరిష్కరిస్తామని చెప్పడం ఎన్నికల ఎత్తుగడేనని ఆరోపించారు. ఓట్లు కోసం వైసీపీ ప్రభుత్వం వేసే మోసపూరిత మాటలను కార్మికులు నమ్మే పరిస్థితిలో లేరని, తమ డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు తం బి శ్రీనివాసరావు, యు.కుమారి, టి.విజయమ్మ, కె.బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వార్డు మెంబర్ ఇంటి ప్రహరీ కూల్చివేత

అందులో పాలకేంద్రం నిర్మించాలని ఆ పార్టీ మండల నేత ప్లాన్
అడ్డుకున్న బాధితులు అడ్డుచెప్పలేని రెవెన్యూ అధికారులు

పీసీపల్లి, జనవరి 3 : అతను వీఆర్ఏ.. పైపెచ్చు నిరుపేద.. అతని కుమారుడికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంటే ఇష్టం. ఆ అభిమానంతో వైసీపీ సానుభూతిపరుడిగా గ్రామ వార్డు మెంబరుకు పోటీచేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. చివరకు ఆ నిరుపేద కుటుంబంపై అదే పార్టీ మండల స్థాయి వైసీపీ నాయకుడు కన్నెర్ర చేశాడు. వివరాల్లోకి వెళితే... మండలంలోని కమ్మవారిపల్లికి చెందిన షేక్ మౌలాలి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో గ్రామసేవకుడు. ఆయన భార్య షేక్ రహంతుబీ పేరున పీసీపల్లిలో 1997లో సర్వేనెంబరు 820లో ప్లాట్‌నెంబరు 119లో 2సెంట్ల నివేశన స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. అప్పటి అధికారులు పట్టా కూడా ఇచ్చారు. ప్రస్తుతం ఆ స్థలానికి ఆనుకుని రైతుభరోసా కేంద్రం, గ్రామ సచివాలయ భవనాలున్నాయి. ఆ పక్కనే మరికొంత ప్రభుత్వ ఖాళీస్థలం ఉంది. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో మౌలాలి తనయుడు దస్తగిరి షెడ్ నిర్మించుకుని విద్యుత్ కనెక్షన్ తీసుకుని నివాసం ఉంటున్నాడు. ఆ స్థలంపై మండల స్థాయి వైసీపీ నాయకుడు కన్నేశాడు. అందులో పాలకేంద్రాన్ని నిర్మించాలనే సాకుతో అధికారులపై ఒత్తిడి తెచ్చాడు. రెవెన్యూ అధికారులు దస్తగిరిని పిలిపించి స్థలాన్ని ఖాళీ చేయాలంటూ మౌఖికంగా ఆదేశించారు. తమ కుటుంబానికి ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందని అతను చెప్పాడు. ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం అవసరం మేరకు మీ పట్టాను రద్దుచేసి పాలకేంద్రం నిర్మించుకునేందుకు స్థలాన్ని కేటాయించామంటూ రెవెన్యూ అధికారులు చెప్పారని బాధితుడు చెప్పాడు. రాతపూర్వకంగా నోటీసు ఇవ్వాలని కోరినా అధికారులు స్పందించలేదని వాపోయాడు. తమకు నోటీసులు ఇవ్వకుండా ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయించకుండా పట్టాను ఎలా రద్దుచేస్తారని బాధితుడు ప్రశ్నించినా ఆలకించే వారే లేరు. ఇదిలా ఉండగా, బుధవారం వైసీపీ నాయకుడు ఎక్స్‌కవేటర్‌ను తీసుకొచ్చి ఆ స్థలంలో ఉన్న ప్రహరీని పడగొట్టి ఇంటిని కూల్చేందుకు యత్నించాడు. మౌలాలి కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో తాత్కాలికంగా నిలిపివేశాడు. దీనిపై తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ వివరణ కోసం పలుమార్లు ఫోన్‌లో సంప్రదించినా అందుబాటులోకి రాలేదు.



ప్రహరీని కూల్చివేసిన ఎక్స్‌కవేటర్

పేదల ఇళ్లపై మాటతప్పిన జగన్

- స్థోమత లేక నిర్మించుకోలేకపోతున్న లబ్ధిదారులు
- ఆర్భాటానికే పరిమితమైన శంకుస్థాపనలు
- ఎక్కడా పూర్తికాని జగనన్న కాలనీలు

మార్కాపురం రూరల్, జనవరి 3 : వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 31 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేపట్టామని గొప్పలు చెప్పుకోవడమే తప్ప క్షేత్రస్థాయిలో ఎక్కడా జరగలేదు. ఇల్లు లేని పేదవాడికి కట్టిస్తామని ముఖ్యమంత్రి జగన్ ఆర్భాటంగా ఇచ్చిన మాట తప్పారు. దీంతో ఎక్కడా జగనన్న కాలనీల్లో నిర్మాణాలు కానరావడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసినప్పటికీ ఇళ్ల నిర్మాణాలు సాగే పరిస్థితి లేదు. రోజు కూలి చేసుకొని బతుకుతున్న తమకు లక్షలు వెచ్చించి ఇంటిని నిర్మించడం సాధ్యం కాదని లబ్ధిదారులు చేతులెత్తేశారు. ప్రభుత్వమే ఇంటిని నిర్మించి ఇస్తామని చెప్పి మోసగించిందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత ఇంటి కల నెరవేరుతుందని ఎదురుచూసినా ఫలితం లేదని అంటున్నారు.

మండలంలో మొత్తం 14 గ్రామ పంచాయతీలలో మాత్రమే జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. నికరంపల్లి, జమ్మనపల్లి, నాయుడుపల్లి, గజ్జలకొండ-1, రాయవరం, గోగులదిన్నె, బోడపాడు, వేములకోట, చింతగుంట్ల, మాల్యవంతునిపాడు, కొండేపల్లి, కోలభీమునిపాడు, బొదలపాడు, ఇడుపూరు జగనన్న కాలనీలు ఉన్నాయి. బోడపాడు గ్రామంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ ఇల్లు కట్టుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. గ్రామానికి దూరంగా కాలనీని ఏర్పాటు చేయడంతో కనీస సౌకర్యాలు


ఇళ్లను పరిశీలిస్తున్న జేఎండీ శివప్రసాద్, అధికారులు


బోడపాడు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జరగక..పెరిగిన పిచ్చి మొక్కలు

ప్రభుత్వం కల్పించకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తుంది. జగనన్న కాలనీ వద్ద సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ మంజూరైనప్పటికీ వాటి నిర్మాణాలు గుంతలకే పరిమితమయ్యాయి. మండలంలోని తిప్పాయపాలెం, పెద్దనాగులవరం, గజ్జలకొండ-2, పెద్దయాచవరం, కొత్తపల్లి, భూపతిపల్లి, శివరాంపురం, గొట్టిపడియ గ్రామ పంచాయతీలలో వివిధ కారణాలతో కాలనీలను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. మార్కాపురం మండలంలో మొత్తం 1495 మంది లబ్ధిదారులకు కాలనీలలో ఇల్లు మంజూరు కాగా కేవలం 196 మంది మాత్రమే ఇప్పటి వరకు గృహాల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారని అధికారులు తెలిపారు. అందులో బోడపాడు గ్రామ కాలనీలో 49 ఇళ్ల స్థలాలు మంజూరు కాగా కేవలం ఒక్కరు మాత్రమే ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. కాలనీలో ఎవరు ఇలా నిర్మాణాలు చేసుకునేందుకు ఆసక్తి చూపకపోవడంతో పిచ్చి కంపతో స్థలాలు నిండిపోతున్నాయి. ఆ ప్రాంతంలోనే ప్రభుత్వ కార్యాలయాలు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లను నిర్మించాలని ప్రయత్నం చేసి కేవలం గుంతలు తీయడం వరకే పరిమితం చేశారు. గజ్జలకొండ-1 జగనన్న కాలనీలో 208 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు కాగా కేవలం 11 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. ఇడుపూరులో 371 ఇళ్లస్థలాలు మంజూరు కాగా కేవలం 34 మంది మాత్రమే నిర్మాణాలను పూర్తి చేశారు. నికరంపల్లి లేఔట్‌లో 70 ఇళ్లస్థలాలు మంజూరు కాగా కేవలం 11 మంది మాత్రమే క ట్టుకున్నారు. గ్రామాలకు దూరంగా, నివాసయోగ్యంకాని చోట కాలనీలను ఏ ర్పాటు చేయడంవల్ల ఇంటి నిర్మాణాలకు ఎవరూ ఆసక్తి చూపకపోగా, ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇస్తామని మాటిచ్చి చేతులెత్తేయడంతో ఆర్థిక స్థోమత లేక నిర్మాణాలు చేపట్టలేకపోతున్నామని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




బోడపాడులో గుంతలకే పరిమితమైన ఆర్బీకే, సచివాలయం

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

- గృహ నిర్మాణ శాఖ జేఎండీ

మార్కాపురం రూరల్ : లబ్ధిదారులు ఇళ్ల నిర్మా ణాలను త్వరిగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ జే ఎండీ శివప్రసాద్ అన్నారు. మండలంలోని ఇడుపూ రు పంచాయతీలో పట్టణ లబ్ధిదారులకు నిర్మిస్తున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను బుధవారం అధికారులతో కలిసి ఆయ న ప రిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.2.70 లక్షలతో నిర్మాణాలు చేపట్టిందన్నారు. లబ్ధిదారులు స్వయంగా ఇంటి నిర్మాణాలు చేసుకుంటే దశలవారీగా ప్ర భుత్వం డబ్బులు అందిస్తుందని తెలిపారు. రెండో పద్ధతిలో లబ్ధిదారులకు ప్రై వేటు ఏజెన్సీ ద్వారా నిర్మాణాలు చేయించి, బిల్లులు మంజూరు చేస్తామని చెప్పారు. ఆయన వెంట గృహ నిర్మాణ శాఖ జిల్లా పీడీ ఈమని పేరయ్య, ఈఈ దాశరథిశర్మ, డీఈ పవన్‌కుమార్, తహసీల్దార్ మంజునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, విద్యుత్ శాఖ ఈఈ నాగేశ్వరరావు, హౌసింగ్ ఏఈ నిర్మల్ బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

జగన్‌రెడ్డిది పెత్తందారీ పాలన

మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కొమరోలు, జనవరి 3 : రాష్ట్రంలో పెత్తందారీ పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటిచర్ల గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని అశోక్‌రెడ్డి బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందన్నారు. సమగ్రాభివృద్ధి, సంక్షేమ పాలన చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి అన్ని వర్గాలనూ మోసగించారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డికి గట్టి బుద్ధి చెప్పాలన్నారు. ప్రజా సమస్యలను, సంక్షేమాన్ని విస్మరించి ప్రతిపక్ష నేతలను వేధించడమే జగన్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారని అన్నారు. టీడీపీ హయాంలో గిద్దలూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని అశోక్‌రెడ్డి గుర్తు చేశారు. వైసీపీ వచ్చాక అభివృద్ధి అనేది ఎక్కడా కన్పించడంలేదన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. నాగున్నరేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అరాచకాలు, దాడులు, అవినీతి పెరిగిపోయిందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, మార్తాల సుబ్బారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముత్తుముల సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు బిజ్జాల తిరుమలరెడ్డి, సీనియర్ నాయకులు బిజ్జం వెంకట్రామిరెడ్డి, పరిశీలకులు ఝాన్సీ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బోనేని జయలక్ష్మి, అన్నపురెడ్డి మల్లికార్జునరెడ్డి, రోసిరెడ్డి, కాశీరావు, బొమ్మిని రవి, పందిళ్ల పుల్లయ్య భూపాల్ యాదవ్, బాలరాజు, రామ్మోహన్, బొమ్మిని శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్వర్‌బాషాకు నివాళి

కంభం, జనవరి 3 : కంభం పట్టణానికి చెందిన షేక్ అన్వర్ బాషా మంగళవారం సాయంత్రం మోక్షగుండం నుంచి కంభంకు వస్తుండగా కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కంభం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కంది కొనుగోలుపై రైతులకు అవగాహన


తళమళ్లలో కందిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పొదిలి, జనవరి 3 : కందిపంట కొనుగోలుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని తళమళ్ల, ఉప్పలపాడు, ఏలూరు, అన్నవరం గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. రాబోవు కంది పంటకు ప్రభుత్వం రూ.7వేల మద్దతు ధర నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. కంది పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. రూ.7వేల మద్దతు ధరతో పాటు అధనంగా రూ.500 ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 8వేల హెక్టార్‌లలో కంది సాగైందని, ఎకరాలకు 3 క్వింటాళ్ల చొప్పున దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేశారు. మండలం మొత్తం 6 వేల టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం గోనెసంచులు, హమాలీ, రవాణా ఖర్చులు బరాయిస్తుందన్నారు. ఈ ఏడాది దిగుబడి తక్కువగా వస్తుందని, ఖర్చులు భారం ఎక్కువగా ఉందని మద్దతు ధరను రూ.10వేల వరకు ఇస్తే రైతులకు ఊరటగా ఉంటుందని అన్నదాతలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు రైతుల అభిప్రాయాన్ని తెలియజేస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సివిల్‌సప్లై మేనేజర్ గ్లోరియా, వ్యవసాయాధికారి జైన్‌లుబ్దీన్, రైతులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

గిద్దలూరు, జనవరి 3 : భిక్షాటనతో జీవించే గుర్తుతెలియని వృ ద్ధుడు పట్టణంలోని క్లబ్ రోడ్డులో మృతిచెందాడు. ఈయన మృతదేహానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గు రూజీ నారాయణరెడ్డి స్పందించి అ ధికారుల దృష్టికి తీసుకుని వచ్చి పంచనామా అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో వి విధ సంఘాల ప్రతినిధులు పా ల్గొని సహకరించారు.


అంత్యక్రియలు నిర్వహిస్తున్న యోగా గురూజీ

రోడ్డుప్రమాదంలో తండ్రీకొడుకు మృతి

- ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో దుర్ఘటన


కారు ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన బైకు

మార్కాపురం రూరల్, జనవరి 3 : బైకును కారు ఢీకొట్టిన ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం మండలంలోని తిప్పాయపాలెం, జంగంగుంట్ల మధ్య జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కంభంకు చెందిన సొరకాయల బుజ్జి (35) కారు డ్రైవర్. ఆయన పెద్దకుమారుడు శివఫణీంద్రకుమార్ (10)కి అనారోగ్యంగా ఉండటంతో బైక్‌పై మార్కాపురంలోని ఆసుపత్రికి తీసుకు వచ్చారు. అక్కడ వైద్యుడికి చూపించుని తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. తి ప్పాయపాలెం, జంగంగుంట్ల గ్రామాల మధ్యకు వచ్చే సరికి ఎదురు వేగంగా వచ్చిన కారు వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తండ్రీకొడుకులిద్దరూ అక్క డికక్కడే మృతి చెందారు. బుజ్జికి భార్య, మరో కుమారుడు ఉన్నారు. మృతిచెందిన పెద్దకుమారుడు శివఫణీంద్ర 3వ తరగతి చదువుతున్నాడు. తండ్రీకొడుకుల మృతితో ఆ కుటుంబంలో విషాదచాయలు అలముకున్నాయి. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని మార్కాపురం రూరల్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.


బుజ్జి, శివఫణీంద్ర మృతదేహాలు


డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సురేష్

ఎన్నికలలోపు వెలిగొండను పూర్తి చేస్తాం

మంత్రి సురేష్

ఎర్రగొండపాలెం, జనవరి 3 : వచ్చే అసెంబ్లీ ఎన్నికలలోపు వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తామని పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఎర్రగొండపాలెంలో పలు అభివృద్ధి పథకాలకు బుధవారం భూమిపూజ, ప్రారంభోత్సవాలను మంత్రి చేశారు. మున్సిపాలిటీ తరహాలో ఇక్కడకు పార్క్ మంజూరు చేయించానన్నారు. టీటీడీ కల్యాణ మండపం పూర్తి చేయించానని అన్నారు. 100 ఎకరాలు స్థల సేకరణ పూర్తయితే ఐటీసీ కంపెనీ ఫ్రూట్ మార్కెట్, జ్యూస్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. రూ.25 లక్షలతో నిర్మించిన స్త్రీ శక్తి భవనం ప్రారంభోత్సవం చేశారు. ఎస్టీవో కాలనీలో 25 లక్షలు ఉపాధి హామీ నిధులతో కాల్వల నిర్మాణానికి భూమి పూజ, సహకార బ్యాంక్ భవన నిర్మాణానికి శంకుస్థాప, రవీంద్ర వైద్యశాల వద్ద రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. కోఆపరేటివ్ బ్యాంకు ద్వారా పొదుపు గ్రూపులకు రూ.కోటీ 10లక్షల చెక్కును మంత్రి పంపిణీ చేశారు. అలాగే కొత్తగా మంజూరైన వృద్ధాప్య పింఛన్‌లను 505 మందికి అందజేశారు. కార్యక్రమంలో పీడీసీసీబీ బ్యాంక్ చైర్‌పర్సన్ వైఎం ప్రసాదరెడ్డి, పీడీసీసీబీ సీఈవో కోటిరెడ్డి, డీఎల్‌డీవో సాయికుమార్, పీడీసీసీబీ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, ఎంపీపీలు డీ కిరణ్‌గౌడ్, కోట్ల సుబ్బారెడ్డి, కందుల వెంకటయ్య, జడ్పీటీసీ సభ్యుడు చేదూరి విజయభాస్కర్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, సర్పంచి ఆర్.అరుణాబాయ్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు కొర్రపోలు జయరావు, వైసీపీ మండల కన్వీనర్లు కొప్పర్తి ఓబులరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, సింగారెడ్డి పోలిరెడ్డి మండల లెవెల అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

మొదలైన పారిశుధ్య కార్మికుల సమ్మె


ధర్నా చేస్తున్న కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 3: మార్కాపురం పట్టణంలో కాంట్రాక్ట్ ఇంజనీరింగ్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె కూడా బుధవారం మొదలైంది. డిమాండ్‌ల సాధన కోసం కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెకు దిగారు. మున్సిపల్ కార్యాలయం ఎదురు బైఠాయించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా నాయకులు అందె నాసరయ్య, డి.సోమయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తుందన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అంటూ కార్మికుల విషయంలో ముఖ్యమంత్రి మాట తప్పారన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, హరి, ఇమాంసా పాల్గొన్నారు.

విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులకు పింఛన్ ఇవ్వాలి


బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న మున్సిపల్ విశ్రాంత ఉద్యోగులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 3: ఆర్టీసీలో పనిచేసి రిటైరైన విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్‌ను ఇవ్వాలని బీజేపీ నాయకులు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణారావు మాట్లాడుతూ.. ఆర్టీసీలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు కార్మిక పింఛన్ రూ.2 వేలు మాత్రమే వస్తుందని వారు జీవించటానికి ఇది సరిపోక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వారికి వృద్ధాప్య పింఛన్ రూ.3వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు నాసరయ్య, కరీం బాషా, జీజే రెడ్డి, ఉమామహేశ్వరరావు, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆదివాసీ అభియాన్‌పై అవగాహన

మార్కాపురం రూరల్, జనవరి 3 : గిరిజనుల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో తోట చందన సూచించారు. ఎంపీడీవో సమావేశ హాలులో బుధవారం ఎంపీడీవో చందన ఆధ్వర్యంలో మండల స్థాయి సిబ్బందికి ప్రధాన మంత్రి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని పెద్ద నాగులవరం, జమ్మనపల్లి గ్రామాలలో ఎస్టీ ఆదివాసాలను గుర్తించాలని కోరారు. ఎస్టీ కుటుంబాలలో ఆధార్ కార్డు, జాబ్ కార్డు, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు లేని వారిని గుర్తించి వారికి ప్రాధాన్యతగా పథకంలో లబ్ధి చేకూర్చాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఫర్వీన్, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు శంఖారావం సభకు తరలిరండి

మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు, జనవరి 3 : కనిగిరి పట్టణంలో ఈనెల 5వ తేదీన జరుగనున్న చంద్రబాబు శంఖారావం సభకు గిద్దలూరు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. కనిగిరిలో జరిగే బహిరంగ సభకు అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాచర్ల మండల పరిశీలకులు మద్దూరి రామకృష్ణ, కంభం మండల పరిశీలకులు పి.మధుబాబు, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, పట్టణశాఖ అధ్యక్షుడు సయ్యద్ షానావలి, మండలశాఖ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, ఆయా మండలాల టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

సభను విజయవంతం చేయండి

పొదిలి : కనిగిరిలో జరిగే చంద్రబాబు శంఖారావం సంభను జయప్రదం చేయాలని వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోరారు. కొనకనమిట్ల, పొదిలి టీడీపీ కార్యకర్తలకు, నాయకులతో ఏర్పాటు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసే నాయకుడిని, పాలనాదక్షత ఉన్న చంద్రబాబును ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు. టీడీపీ హయాంలో రూ.200 ఉన్న పెన్షన్‌ను చంద్రబాబు పాలనలో రూ.2వేలకు పెంచిన ఘనత టీడీపీదన్నారు. జగన్‌రెడ్డి పాదయాత్రలో రూ.3వేలు పింఛన్ ఇస్తానని చెప్పి నాలుగు సంవత్సరాల 9 నెలలు దాటినా రూ.2750కి మించి పెంచలేదన్నారు. చేతగాని పాలన, నెరవేర్చలేని హామీలతో పేదలపై ధరల భారం మోపి ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. పేదలతోపాటు రాజధాని రైతులను, ఉపాధ్యాయులను, అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులను జగన్‌రెడ్డి విస్మరించారన్నారు. మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు వైసీపీ పాలనలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నామన్నారు. జగన్‌రెడ్డిని గద్దె దింపేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. జగన్‌రెడ్డి దుర్మార్గ పాలనపై ప్రజలు ఆగ్రహంతో ఊగిపోతున్నారని అన్నారు. 5వ తేదీన కనిగిరిలో బాబు సభను విజయవంతం చేయడం ద్వారా ఐకృతను చాటిచెప్పాలన్నారు. స్పర్థలు వీడి పార్టీ విజయానికి కలిసి పనిచేయాలని కందు ల పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు డీ రాజానాయుడు, మండల పరిశీలకుడు గోవిందరెడ్డి, పమిడి రవికుమార్, పొదిలి, కొనకనమిట్ల మండలాల అధ్యక్షులు మీగడ ఓబులరెడ్డి, మోరబోయిన బాబూరావు, పట్టణ అధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కాటూరి పెదబాబు, మాజీ సర్పంచ్‌లు కాటూరి చినబాబు, డాక్టర్ స్వర్ణగీత, ఏఎంసీ మాజీ చైర్మన్ రామలింగ య్య, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, శివాల యం మాజీ చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, రెండు మండలాల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

సురక్ష వైద్య శిబిరం ప్రారంభం

గిద్దలూరు టౌన్, జనవరి 3 : ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. వివిధ విభాగాల స్పెషలిస్టులు రోగులకు వైద్యసేవలందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆర్డీ రామకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్ రామక్రిష్ణయ్య, వైద్యాధికారులు డాక్టర్ సుమయ, డాక్టర్ భార్గవరెడ్డి, డాక్టర్ మహబూబ్‌షరీఫ్ పాల్గొన్నారు.


సారెను అందిస్తున్న భక్తులు

ఆలయంలో ధనుర్మాస పూజలు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 3: శివాజీ నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆండాళ్ అమ్మవారికి సారె (ఒడి బియ్యం కార్యక్రమం) నిర్వహించారు. భక్తులు ఇళ్ల వద్ద నుంచి పసుపుకుంకుమ, ఒడి బియ్యం, పూలు, పండ్లు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు.

సావిత్రిబాయిపూలేకు ఘన నివాళి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 3: సంఘ సేవకురాలిగా మొదటి మహిళా ఉపాధ్యాయినిగా సావిత్రి బాయి పూలే చేసిన సేవలు ఎంతో ఆదర్శనీయమని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సావిత్రి బాయి స్త్రీవాద ఉద్యమానికి మార్గదర్శకురాలిగా నిలిచి, ప్రతి ఒక్కరూ చదువుకునేందుకు మార్గం చూపారన్నారు. బీసీ భవన్‌లో పిన్నిక లక్ష్మీ ప్రసాద్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతిని నిర్వహించారు.


సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

త్రిపురాంతకం : సావిత్రి బాయిపూలే జయంతి కార్యక్రమాన్ని శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో త్రిపురాంతకంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ సావిత్రీబాయి సమాజంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ఆదర్శాలకు కట్టుబడి సామాజిక మార్పునకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జీ నాసరయ్య, పిచ్చయ్య,జి.నాసరయ్య, ప్రసాద్, ప్రభాస్ పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : సావిత్రిబాయి పూలె జయంతి సందర్భంగా పట్టణంలోని ఆమె విగ్రహానికి పలువర్గాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు కంచర్ల కోటయ్యగౌడ్, కటారు అరుణ్, తొండమల్ల బ్రహ్మయ్య, స్వామికొండయ్య, గోపాల్, బాలచెన్నయ్య, కోటి లింగాచారి పాల్గొన్నారు. బీజేపీ నాయకులు సైతం సావిత్రిబాయి పూలె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

5న చంద్రబాబు బహిరంగ సభ



వెలిగండ్లలో గ్రామస్థులతో మాట్లాడుతున్నా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముత్తార్



తాళ్లూరులో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు

సభ విజయవంతానికి గ్రామాల్లో విస్తృతంగా

పర్యటిస్తున్న టీడీపీ నేతలు

ప్రజలతో సమావేశాలు, ఆహ్వానాలు

ఊరూరా కేడర్‌ను కదిలిస్తున్న నాయకులు

వెలిగండ్ల, జనవరి 3 : కనిగిరిలో ఈ నెల 5వ తేదీన వెలిగొండ సాధన ప్రాంగణం వద్ద టీడీపీ అధినేత చంద్రబాబు భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముత్తార్ కోరారు. బుధవారం మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో టీడీపీ నాయకులు సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే డాక్టరు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యామల కాశీరెడ్డి, దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, గవదకట్ల హరి, ముత్తిరెడ్డి, కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, ప్రతాప్, మోటాటి సుబ్బారెడ్డి, సలొమన్ రాజు, మీనిగ కాశయ్య, కర్నాటి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, అవుల మాలకొండారెడ్డి, గొరిగే సుబ్రమణ్యం, మనోజ్, కేలం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు

పామూరులో...

పామూరు, జనవరి 3 : కనిగిరిలో టీడీపీ అధినేత చంద్రబాబు విజయ శంఖారావం ఎన్నికల సభకు పామూరు నుంచి టీడీపీ, జనసేన తరఫున భారీగా తరలి రావాలని టీడీపీ మండల కమిటీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండలంలోని కంభాలదిన్నె, బొట్లగూడూరు. అయ్యవారిపల్లి, బోడవాడ, వగ్గంపల్లి, రావిగుంటపల్లి, తూర్పుకోడిగుడ్లపాడు, దాదిరెడ్డిపల్లి, చింతలపాలెం పంచాయతీల్లో పరిశీలకుడు రమణారెడ్డితో కలిసి ఆయన విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో నేతలు దశరథరాములు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, మన్నం రమణయ్య, అడుసుమల్లి నరసింహులు, పువ్వాడి వెంకట్‌చౌదరి, శ్రీకాంత్, గోళ్ల వీరబాబు పాల్గొన్నారు.

పీసీపల్లిలో...

పీసీపల్లి, జనవరి 3 : టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎన్నికల శంఖారావం సభకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

తాళ్లూరులో...

తాళ్లూరు, జనవరి 3 : మాజీ సీఎం చంద్రబాబు కనిగిరిలో నిర్వహిస్తున్న శంఖారావం సభకు మండలం నుంచి టీడీపీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీమవరపు సుబ్బారావు కోరారు. స్థానిక ఎన్టీఆర్ భవనంలో టీడీపీ నేతల విస్తృత స్థాయి సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి మానం రమేష్‌బాబు, చిలకలూరిపేట నియోజకవర్గ మైనారిటీ సెల్ నేత రియాజ్, నేతలు బట్టురాజు, ప్రసన్నాంజనేయరాజు, ఐ. శ్రీనివాసరెడ్డి, కైపు నాగార్జునరెడ్డి, హనుమయ్య, నాగయ్య, కూటాల రవి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సీఐటీయూ కార్మికుల సమ్మెలో పాల్గొన్న

ఏఐటీయూసీ కార్మికులు



మాట్లాడుతున్న ఖాశింవలి

కనిగిరి, జనవరి 3 : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు ఖాసింవలి డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రతతోపాటు కార్మికులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, సీ ఎం జగన్ కార్మికులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీఎం మున్సిపల్ కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి తగదన్నారు. సీఎం నిరంకుశ వైఖరి కారణంగానే మున్సిపల్ కార్మికులు సమ్మెకు దిగారన్నారు. కనిగిరిలో ప్రధాన వీధులు, డ్రైనేజీ కాలువలు చెత్తా చెదారాలతో నిండిపోయాయన్నారు. సీఎం జగన్‌రెడ్డి సత్వరమే మున్సిపల్ కార్మికులు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఏఐటీయూసీ, సీఐటీయూ సంయుక్తం గా చేపడుతున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆలూరి కోటయ్య, చియాద్రి అశోక్, నాసర్, కిరణ్, పవన్‌కుమార్, మస్తాన్, రవి, తాజుద్దీన్, మదు, మస్తాన్‌వలి, ఐజాక్, సామేలు, సుబ్రహ్మణ్యం, ఖాశింపీరా, చంద్రమోహన్, యేసుబాబు, మూర్తి, ఇమాంహుస్సేన్ పాల్గొన్నారు.

దర్శిలో నేటి నుంచి నగర పంచాయతీ కార్మికుల సమ్మె



చైర్మన్ పిచ్చయ్యకు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

దర్శి, జనవరి 3 : రాష్ట్ర ప్రభుత్వం ఎంతోకాలంగా అపరిశుభ్రంగా ఉన్న సమస్యలను పరిష్కరించనందుకు నిరసనగా దర్శి నగర పంచాయతీ కార్మికులు గురువారం నుంచి సమ్మె చేస్తున్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం కార్మికులు నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యకు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల యూనియన్ నాయకులు ఇత్తడి పుల్లయ్య, మరియమ్మలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించటంలతో నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తుండటం వలనే సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇత్తడి దావీదు, బాబురావు, ఇస్సాక్, ఏసేబు, జెస్సీ పాల్గొన్నారు.

పొలం తగాదాలో ఒకరిపై ఒకరు దాడి

తహసీల్దార్ ఎదుటే ఘర్షణ

వెలిగండ్ల, జనవరి 3 : పొలం విషయంలో ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు, అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగికి మధ్య సాక్షాత్తు తహసీల్దార్ ఎదుటే ఘర్షణ జరిగింది. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన సానికొమ్ము రమణారెడ్డి తన పేరు మీద ఉన్న సర్వే నెంబర్ 92-2లో 4 ఎకరాల భూమిని 2022 సంత్సరంలో అప్పటి తహసీల్దార్ జ్వాలా నరసింహం అక్రమంగా మాదాల మాలకొండయ్య పేరు మీద ఆన్‌లైన్ చేశారని, దానిని తొలగించి న్యాయం చేయాలని గత నెల 22న వెలిగండ్లలో నిర్వహించిన స్పందనలో అర్జీ అందజేశాడు. ఈ విషయంపై తహసీల్దార్ వాసు ఇరువురిని కార్యాలయానికి పిలిపించారు. ఈ క్రమంలో మాదాల మాలకొండయ్య బంధువు కావడంతో ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడైన నాగుర్‌యాదవ్ కూడా కార్యాలయానికి వచ్చాడు. వివరాలు సేకరిస్తున్న సమయంలో సానికొమ్ము రమణారెడ్డి, నాగుర్ యాదవ్‌లు ఒకరిపై ఒకరు తహసీల్దార్ ఎదుటనే దూషించుకుంటూ దాడిచేసుకున్నారు. ఇద్దరికీ గాయాలయ్యాయి. ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

ఆశాజనకంగా బోర్ల కింద వరి సాగు

దొనకొండ, జనవరి 3 : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో మండలంలో బోర్ల కింద సాగు చేసిన వరి పంటలో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నట్లు ఏవో లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని రామాపురంలో బుధవారం వరిపంట కోత దిగుబడి ప్రయోగాలను చేశారు. ఈ కార్యక్రమంలో రైతుభరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు కృష్ణారెడ్డి, బజాజ్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

దర్శి, జనవరి 3 : రిటైర్డ్ ఉద్యోగులు స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికెట్లు నమోదు చేసుకోవాలని దర్శి తాలూకా రిటైర్డ్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు ఆర్ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 2 నుంచి ఫిబ్రవరి 29వ తేదీ వరకు సబ్ ట్రెజరీ కార్యాలయంలో నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు.

నేటి నుంచి వికసిత్ భారత్ సంకల్పయాత్ర

దొనకొండ, జనవరి 3 : కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన వికసిత్ భారత్‌సంకల్ప యాత్ర కార్యక్రమం మండలంలో గురువారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వసంతరావునాయక్ తెలిపారు. కేంద్రప్రభుత్వం మంజూరు చేసే వివిధ పథకాలకు అర్హులై ఇప్పటి వరకు ప్రయోజనం పొందని వారికి పథకాలు చేర్చటమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు వివరించారు. 4వ తేదీ చందవరం, 13వ తేదీ గంగదేవిపల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రజలు పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

నేడు తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు దారి మళ్లింపు

దొనకొండ, జనవరి 3 : గుంటూరులో సాయంత్రం 4-30 గంటలకు బయలుదేరి 6-14 గంటలకు దొనకొండకు చేరి, నంద్యాల మీదుగా తిరుపతి వెళ్లే 17261 నెంబరు గల తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు డబ్లింగ్ లైను పనుల కారణంగా గురువారం ఒక్కరోజు దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఈ రైలు గురువారం సాయంత్రం గుంటూరులో బయలుదేరి తెనాలి, ఒంగోలు, గూడూరు, రేణిగుంట మీదుగా తిరుపతి చేరుతుందని వివరించారు.

సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి

పామూరు, జనవరి 3 : దళితులు, స్త్రీ జనోద్ధరణకు, మహిళా విద్యకు కృషి చేసిన సామాజిక విప్లవకారిణి సావిత్రి బాయిపూలే అని హెచ్ఎం షేక్ మహబూబ్‌బాష చెప్పారు. మండలంలోని నర్రమారెళ్ల ప్రభుత్వప్రాథమికోన్నత పాఠశాలలో సావిత్రీబాయి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి నివాలర్పించారు. ఉపాధ్యాయులు టీ రమేష్, ఎస్వీ ప్రసాద్, బీ కోటేశ్వరరావు, ఎన్ నీరజ, సుజాత పాల్గొన్నారు.

లబ్ధిదారుల పేర్లు పక్కాగా నమోదు చేయాలి



రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

పామూరు, జనవరి 3 : రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూములను సెటిల్‌మెంట్ భూములుగా మార్చుతున్న తరుణంలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా లబ్ధిదారుల పేర్లను పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి బుధవారం ఆయన విచ్చేశారు. ఫ్రి ఆఫ్ అసైన్డ్‌మెంట్ ల్యాండ్ ప్రోగ్రాం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆవుల సురేష్ పాల్గొన్నారు.

మండలానికి 116 నూతన పింఛన్లు మంజూరు

పామూరు, జనవరి 3 : మండలానికి వైఎస్సార్ నూతన పింఛన్లు 116 మంజూరైనట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. పెరిగిన పింఛన్లను 5వ తేదీన వలంటీర్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

దారపనేని సౌజన్యంతో దీక్షధారులకు భిక్ష

పామూరు, జనవరి 3 : స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యఅన్నదాన కార్యక్రమంలో భాగంగా ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ సౌజన్యంతో విజయవాడ కీర్తి ఆటోఫైనాన్స్ అధినేత ఏలూరి విజయ చంద్రబాబు, సావిత్రి, కుమార్తె వెంకటకీర్తి ఆర్థిక సహకారంతో బుధవారం అయ్యప్పలకు భిక్షను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దారపనేని తరఫున ప్రతినిధులు, పచ్చవ వెంగయ్య, షేక్ ఖాదర్‌మోహిద్దీన్‌లకు స్వామి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు కావిటి సుబ్బయ్య, గుత్తిరాజ, వాయునేని మాల్యాద్రి, రాచూరి సురేష్ పాల్గొన్నారు.

వైసీపీ వార్డు మెంబర్ ఇంటి ప్రహరీ కూల్చివేత

అందులో పాలకేంద్రం నిర్మించాలని ఆ పార్టీ మండల నేత ప్లాన్

అడ్డుకున్న బాధితులు

అడ్డుచెప్పలేని రెవెన్యూ అధికారులు



ఎక్స్‌కవేటర్‌తో ప్రహరీ కూల్చివేత

పీసీపల్లి, జనవరి 3 : అతను వీఆర్ఏ.. పైపెచ్చు నిరుపేద.. అతని కుమారుడికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంటే ఇష్టం. ఆ అభిమానంతో వైసీపీ సానుభూతిపరుడిగా గ్రామ వార్డు మెంబరుకు పోటీచేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. చివరకు ఆ నిరుపేద కుటుంబంపై అదే పార్టీ మండల స్థాయి వైసీపీ నాయకుడు కన్నెర్ర చేశాడు. వివరాల్లోకి వెళితే... మండలంలోని కమ్మవారిపల్లికి చెందిన షేక్ మౌలాలి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో గ్రామసేవకుడు. ఆయన భార్య షేక్ రహంతుబీ పేరున పీసీపల్లిలో 1997లో సర్వేనెంబరు 820లో ప్లాట్‌నెంబరు 119లో 2సెంట్ల నివేశన స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. అప్పటి అధికారులు పట్టా కూడా ఇచ్చారు. ప్రస్తుతం ఆ స్థలానికి ఆనుకుని రైతుభరోసా కేంద్రం, గ్రామ సచివాలయ భవనాలున్నాయి. ఆ పక్కనే మరికొంత ప్రభుత్వ ఖాళీస్థలం ఉంది. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో మౌలాలి తనయుడు దస్తగిరి షెడ్ నిర్మించుకుని విద్యుత్ కనెక్షన్ తీసుకుని నివాసం ఉంటున్నాడు. ఆ స్థలంపై మండల స్థాయి వైసీపీ నాయకుడు కన్నేశాడు. అందులో పాలకేంద్రాన్ని నిర్మించాలనే సాకుతో అధికారులపై ఒత్తిడి తెచ్చాడు. రెవెన్యూ అధికారులు దస్తగిరిని పిలిపించి స్థలాన్ని ఖాళీచేయాలం టూ మౌఖికంగా ఆదేశించారు. తమ కుటుంబానికి ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందని అతను చెప్పాడు. ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం అవసరం మేరకు మీ పట్టాను రద్దుచేసి పాలకేంద్రం నిర్మించుకునేందుకు స్థలాన్ని కేటాయించామంటూ రెవెన్యూ అధికారులు చెప్పారని బాధితుడు చెప్పాడు. రాత పూర్వకంగా నోటీసు ఇవ్వాలని కోరినా అధికారులు స్పందించలేదని వాపోయాడు. తమకు నోటీసు లు ఇవ్వకుండా ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయించకుండా పట్టాను ఎలా రద్దుచేస్తారని బాధితుడు ప్రశ్నించినా ఆలకించే వారే లేరు. ఇదిలా ఉండగా, బుధవారం వైసీపీ నాయకుడు ఎక్స్‌కవేటర్‌ను తీసుకొచ్చి ఆ స్థలంలో ఉన్న ప్రహరీని పడగొట్టి ఇంటిని కూల్చేందుకు య త్నించాడు. మౌలాలి కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో తాత్కాలికం గా నిలిపివేశాడు. ఈ విషయమై తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ వివరణ కోసం పలుమార్లు ఫోన్‌లో సంప్రదించినా అందుబాటులోకి రాలేదు.

ఎన్నికల సమర శంఖారావానికి సర్వం సిద్ధం

కనిగిరి ప్రారంభసభకు టీడీపీ అధినేత చంద్రబాబు రాక

డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు

సభావేదికకు ముందుగా భూమి పూజ చేసిన

నూకసాని, డాక్టర్ ఉగ్ర



సిద్ధం చేస్తున్న వేదిక

కనిగిరి, జనవరి 3 : రాష్ట్రంలో ఎన్నికల సమర శంఖారావాన్ని తొలిగా ఈ నెల 5వ తేదీన కనిగిరిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు కనిగిరిలో నాంది పలకనున్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఆధ్వర్యంలో సభావేదికతో పాటు ఇతర ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రారంభవేదిక ఏర్పాటు సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నూకసాని బాలాజీ చేతులమీదుగా డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి భూమి పూజ ఏర్పాట్లు బుధవారం చేపట్టారు. తెలుగుమహిళలు భూమి పూజకు అంకురార్పణ చేయగా, వేదపండితులు మంత్రోచ్చరణ చేశారు. శంఖారావం సభకు "రా కదిలిరా" అంటూ డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పిలుపుతో నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణివాహినిగా కదలి రానుంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ఆయా మండలపార్టీ అధ్యక్షులు, నేతలు జన సమీకరణకు సిద్ధమయ్యారు. గ్రామస్థాయి నాయకులతో సమాలోచనలు చేస్తూ సభ విజయవంతానికి కృషి చేస్తున్నారు. చంద్రబాబు సభ వద్దకు సౌకర్యవంతంగా చేరుకునేందుకు డాక్టర్ ఉగ్ర చేపడుతున్న చర్యలు గత సభలకు భిన్నంగా ఉండనున్నాయి. నియోజకవర్గంలోని ద్వితీయ శ్రేణి నాయకులు సమాలోచనలతో డాక్టర్ ఉగ్ర ఆలోచనలను మిళితం చేస్తూ సభాప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. సభ ప్రధాన మార్గాన్ని మూడు దారులుగా విభజించి ప్రజలకు, నాయకులకు, ముఖ్యులుగా వేర్వేరుగా ఏర్పాటు చేస్తున్నారు. అందుకు అనుకూలంగా సభాప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. బుధవారం అమరావతి నుంచి ప్రత్యేక వాహనాల్లో వేదిక నిర్మాణానికి అవసరమయ్యే సామగ్రి పెద్ద ఎత్తున చేర్చారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రానుండటంతో ప్రభుత్వ అధికార యంత్రాంగం కూడా సభా ప్రాంగణం ఏర్పాట్లును పరిశీలించింది. ఆర్డీవో జాన్‌ఇర్విన్ ప్రత్యేకంగా రెవెన్యూ బృందంతో సభాప్రాంగణం వద్దకు వచ్చి పనులను, హెలీప్యాడ్ నిర్మాణ స్థలిని పరిశీలించి డాక్టర్ ఉగ్రతో చర్చించారు. రెండు రోజులుగా పోలీసు ఉన్నతాధికారులైన డీఎస్పీ రామరాజుతోపాటు సీఐ, ఎస్ఐలు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. సభావేదిక వద్ద భద్రతా ఏర్పాట్లపై పోలీసులు చర్యలు తీసుకోనున్నారు. గ్రామగ్రామాన అధికార పార్టీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరేందుకు ఎంతో మంది ఉత్సాహం చూపుతున్నారు. నియోజకవర్గ పరిశీలకులు జీ నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, నాయకులు రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, వీవీఆర్ మనోహరరావు, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, బాలు ఓబులురెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో శంకరరావు

ముండ్లమూరు, జనవరి 3 : మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు వేగవంతం చేయించటంలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు ఉంటాయని ఎంపీడీవో బీ శంకరరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలలో ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి పనులు మొదలుపెట్టాలని, అలా చేయకుంటే అసిస్టెంట్‌లు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇన్‌చార్జ్ ఏపీవో మురళీ, ఈసీ ప్రసాదు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ముండ్లమూరు, జనవరి 3 :మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 59 మంది లబ్ధిదారులకు మంజూరైన పింఛన్‌లను బుధవారం ఎంపీపీ సుంకర సునీత మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు టీ రత్నరాజు, ఎంపీడీవో బీ శంకరరావు, మండల వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మానందరెడ్డి, ఈవోఆర్‌డీ శ్రీదేవి, జూనియర్ అసిస్టెంట్ కరుణాకర్ తదితరులు ఉన్నారు.

మట్టి ఖర్చులకు నగదు అందజేత

తాళ్లూరు, జనవరి 3 : వైఎస్సార్ బీమా పథకం కింద మృతి చెందిన దాసరి పౌల్‌రాణి కుటుంబానికి మట్టిఖర్చులకుగాను సర్పంచ్ మేకల చార్లెస్ సర్జన్, గ్రామకార్యదర్శి జె.లక్ష్మీకాంత్, వెల్ఫేర్ అసిస్టెంట్ కె.కృష్ణారెడ్డిలు బుధవారం రూ.10 వేలు అందజేశారు. తాళ్లూరు గ్రామానికి చెందిన దాసరి నాగేశ్వరరావు(42) ఇటీవల మృతి చెందాడు. మృతునికి వైఎస్సార్ బీమాలో సభ్యుడుగా ఉన్నాడు. తాళ్లూరు-2 గ్రామకార్యదర్శి ఏ. చిరంజీవి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు

తాళ్లూరు, జనవరి 3 : ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేదించనందున కిరాణాషాపులు, దుకాణాలలో వాటిని వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తాళ్లూరు పంచాయతీ కార్యదర్శి జె.లక్ష్మీకాంత్ హెచ్చరించారు. గ్రామంలోని అన్ని దుకాణాల్లో బుధవారం విస్తృతస్థాయి తనిఖీచేపట్టారు. పలు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు ఉండటాన్ని గుర్తించి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పూనూరి రామారావు పాల్గొన్నారు.

బీఎస్పీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

పామూరు, జనవరి 3 : బీఎస్పీ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ అధ్యక్షుడు పి. బాలోబయ్య చెప్పారు. స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 30 మంది పార్టీలో చేరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీ చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా నాదెండ్ల నాగూరు, ప్రధాన కార్యదర్శిగా బీ రాజశేఖర్, రాగి పోతురాజు, కోశాధికారిగా కే వెంకటనారాయణతో పాటు మరో10 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. పార్టీ అభివృద్ధికి పనిచేయాలని తీర్మానించారు.

నిరుద్యోగులు ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలి

కనిగిరి, జనవరి 3 : ప్రభుత్వం నిరుద్యోగ యువతకు కల్పించే ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సీడాప్ జేడీఎం రజనీకాంత్, జేసీవో నర్మద బుధవారం ఒక ప్రకటనలో కోరారు. డీఆర్‌డీఏ వైకేపీ, సీడాప్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉపాధి శిక్షణా తరగతులను వినియోగించుకుని ఉద్యోగాలు పొందాలని కోరారు. ప్రకాశం జిల్లాకు చెందినవారై ఉండి 10వ తరగతి, ఆపై డిగ్రీ పాసైన యువతీ యువకులు పలు ఉద్యోగాలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కోర్సులలో శిక్షణ ఉచితంగా పొందాలంటే ఉపాధి పథకంలో పనిచేసే వారి కుటుంబానికి చెందినవారై ఉండటంతో పాటు 18 ఏళ్ల దాటిన యువతీ యువకులకు అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణా కాలంలో హాస్టల్ వసతితో పాటు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 9553184107 నెంబరులో సంప్రదించాలని కోరారు

నేడు మండల సర్వసభ్య సమావేశం

పామూరు, జనవరి 3 : పామూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంగసాని లక్ష్మీ అధ్యక్షతన గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

గుంటిగంగ దేవస్థాన ఉపఅర్చకుడు తొలగింపు

తాళ్లూరు, జనవరి 3 : దేవదాయశాఖ ఉన్నతాధికారుల విధులకు ఆటంకం కల్గించటంతో పాటు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గుంటిగంగాభవానీ దేవస్థాన ఉపఅర్చకులు ఏ సాంబశివరావును విధుల నుంచి తొలగిస్తూ ఆలయ ఈవో పి.కార్తిక్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అమ్మవారికి నిత్య పూజా కార్యక్రమాలు చేయనందుకు, భక్తులకు ఆటంకం కలిగించి, సిబ్బందిని వారి విధులను చేయకుండా ఇబ్బంది పెట్టినందుకు, అనుమతి లేకుండా గత నెల 25 నుంచి 27వ తేదీవరకు విధులకు గైర్హాజరు కావటంతో పాటు, రెండు నోటీసులు ఇచ్చినా సమాధానం ఇవ్వనందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈవో తెలిపారు.



బాపట్ల కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి



గుంటూరులో కలెక్టరేట్ ముట్టడిలో సొమ్మసిల్లి పడిపోయిన అంగన్‌వాడీ కార్యకర్త

నిరసనాగ్రహం



డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. మూడు వారాల నుంచి సమ్మె చేస్తున్న అంగన్ వాడీ లు బుధవారం కలెక్టరేట్ల ముట్టడికి పిలుపిచ్చారు. పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించినా అంగన్‌వాడీలు కలెక్టరేట్ల ముట్టడి ని జయప్రదం చేశారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి అంగన్ వాడీలు జిల్లా కేంద్రాలకు చేరుకోవడంతో రహదారులన్నీ ఆందోళన కారులతో నిండిపోయాయి.
వందల సంఖ్యలో పోలీసులతో కలెక్టరేట్ల దగ్గర పహారా పెట్టి భయానక వాతావరణాన్ని ప్రభుత్వం సృష్టించినా అంగన్‌వాడీలు తగ్గలేదు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కలెక్టరేట్ ప్రాంతాలు హోరెత్తాయి. పారిశుధ్య కార్మికులు, ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు ఎక్కడికక్కడ ఆందోళనలను కొనసాగించారు.

- ఆందోళనలతో అట్టుడికిన బాపట్ల
- కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు
- ఆర్డీవో కార్యాలయంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా
- యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల 12 గంటల ధర్నా
- ఎక్కడికక్కడ మున్సిపల్ కార్మికుల సమ్మె, ప్రదర్శనలు

బాపట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు బుధవారం పెద్దఎత్తున ఆందోళన చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ ప్రదర్శనలు నిర్వహించారు. కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, ధర్నా చౌక్ వద్ద ఆందోళనలు చేశారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తీవ్రంగా ఖండించారు. తమ డిమాండ్లను నెరవేర్చేదాకా ఆందోళనలు విరమించేది లేదని స్పష్టం చేశారు. ఆయా వర్గాల ఆందోళనలతో బాపట్ల దద్దరిల్లింది. అడుగడుగునా పోలీసు ఆంక్షలతో నిర్బంధించినా కలెక్టరేట్ ముట్టడికి అంగన్‌వాడీలు కదం తొక్కారు. తమ డిమాండ్ల సాధన కోసం మూడు వారాల నుంచి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు బుధవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపిచ్చారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో పోలీసులు కలెక్టరేట్‌కు వెళ్లే అన్ని దారులను తమ అదుపులోకి తీసుకున్నారు. పదుల సంఖ్యలో ఖాకీలు మొహరించి వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వెళ్లే వారిని సైతం అడ్డుకున్నారు. ఇన్ని ఆంక్షలు పెట్టిన అంగన్‌వాడీలు భారీ సంఖ్యలో కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి అంగన్‌వాడీలు బాపట్లకు చేరు కోవడంతో రహదారులన్నీ వారితో నిండిపోయాయి. పారిశుధ్య కార్మికులు, ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, మున్సిపాలిటీ ఇంజనీరింగ్ ఉద్యోగుల ఆందోళనలతోబాపట్ల పట్టణం నిరసనలతో హోరెత్తింది.



కార్యకర్తను అంబులెన్స్‌లోకి తీసుకువెళుతూ...



గుంటూరు కలెక్టరేట్ వద్ద రోడ్డుపై పడుకుని ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

ఆంక్షలను ఛేదించుకుని..

జిల్లాలోని నలుమూలల నుంచి అంగన్‌వాడీలు కలెక్టరేట్ గేటు వద్దకు ఉదయం నుంచే చేరుకోవడం మొదలుపెట్టారు. విపరీతమైన ఆంక్షలు పెట్టినప్పటికీ వాటిని ఛేదించుకుని అంగన్‌వాడీలు కలెక్టరేట్ వద్దకు భారీగా చేరుకున్నారు. ప్రభుత్వం తమకు చేసిన మోసాన్ని పాటలు పాడుతూ నిరసన వ్యక్తం చేశారు. పోలీసులను దాటుకుని కలెక్టరేట్‌లోకి చొచ్చుకువెళ్లే ప్రయత్నాన్ని అంగన్‌వాడీలు చేయగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఒక దశలో పోలీసులకు, అంగన్ వాడీలకు మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై అంగన్‌వాడీలు మండిపడ్డారు. హామీల అమలుపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలన్న నినాదాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. విధుల్లో చేరకపోతే తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడితే బెదిరిపోమని అంగన్ వాడీలు స్పష్టం చేశారు. తమను తొలగించాలనుకుంటే [illegible] ఊరుకునేది లేదని, ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని ప్రకటించారు.

ప్రభుత్వం మోసం చేసింది : పారిశుధ్య కార్మికులు

కనీస వేతనాలు అమలు చేయకుండా ప్రభుత్వం తమను మోసం చేసిందని మున్సిపాలిటీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు బుధవారం సమ్మె కొనసాగించారు. మున్సిపాలిటీ ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. వీరి సమ్మెకు మద్దతు తెలుపుతూ మున్సిపాలిటీ ఇంజనీరింగ్ సిబ్బంది ప్రదర్శన చేశారు. వేతనాలు పెంచి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు



బాపట్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, పారిశుధ్య కార్మికులు

యూటీఎఫ్ పన్నెండు గంటల దీక్ష...

పీఆర్‌సీ, డీఏ బకాయిలు చెల్లించకుండా ఉద్యోగులకు వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. ఉద్యోగులు, ఉపాధ్యా యులకు రావాల్సిన బకాయిల ను వెంటనే చెల్లించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పన్నెండు గంట ల దీక్ష చేపట్టారు



బాపట్లలో వంటావార్పు చేస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు



బాపట్ల కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

సమగ్ర శిక్షా అభయాన్ ఉద్యోగుల నిరసన

తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం పదిహేనో రోజుకు చేరుకుంది. ఉద్యోగులు మోకాళ్లపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తమను మోసం చేసిందని, రెండు వారాలకు పైగా సమ్మె చేసున్నా, పాలకులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు.



రేపల్లె ఆర్డీవో కార్యాలయం వద్ద సమస్యలు పరిష్కరించాలంటూ వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు, ఏఐటీయూసీ నాయకులు



బాపట్ల : మున్సిపల్ కార్మికుల నిరవధికసమ్మెకు మద్దతుగా ప్రదర్శన చేస్తున్న ఇంజనీరింగ్, వాటర్ స్కీమ్ వర్కర్స్

ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమం

రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరం

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యేలు ఏలూరి, అనగాని

టీడీపీ, జనసేన శ్రేణులు కలిసి నడవాలని మాజీ మంత్రి ఆనందబాబు పిలుపు

భట్టిప్రోలు, జనవరి 3: అరాచక పాలనను అంతమొందించేందుకు ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని పెదపులివర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవాన్ని నలుదిశలా చాటిచెప్పిన ఎన్టీఆర్ తెలుగు వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటారన్నారు. రాష్ట్రానికి ముందు చూపు కలిగిన చంద్రబాబు నాయకత్వం అవసరమని తెలిపారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా రాష్ట్ర భవిష్యత్ అంధకారంలోకి వెళ్తుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధనకు చంద్రబాబు కట్టుబడి పని చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలకు రూపకర్త ఎన్టీఆర్ కాగా, అభివృద్ధి - సంక్షేమం రెండు కళ్లలా చంద్రబాబు పాలన చేశారన్నారు. అధికారం పోతే జగన్‌రెడ్డి ప్రజల్లో ఉండలేడని తెలిపారు. మూడు ఎమ్మెల్సీ స్థానాలు టీడీపీ కైవసం చేసుకున్న దగ్గర నుంచి జగన్‌రెడ్డి ఓటమి భయంతో ఉన్నారన్నారు. జనసేన, టీడీపీ పొత్తుతో క్లీన్‌స్వీప్ చేయబోతున్నామన్నారు. టీడీపీ, జనసేన శ్రేణులు కలిసి నడవాలని పిలుపు ఇచ్చారు. తొలుత వెల్లటూరు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి అనగాని, రంగా విగ్రహానికి ఆనందబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తారకరామా ఫౌండేషన్ సభ్యులు అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, మండల కన్వీనర్ వాకా శేషుబాబు, నాయకులు మైనేని మురళీకృష్ణ, కనగాల మధుసూదనప్రసాద్, వేములపల్లి జగన్నాథరావు, నూతక్కి దినకర్‌బాబు, మోటూరు పుణ్యశ్రీనివాసరావు, జంపని వీరయ్య, జి. శ్రీనివాసరావు, కొసరాజు సతీష్, కంఠంనేని పసి, నక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పెదపులివర్రులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు అనగాని, ఏలూరి, ఆనందబాబు



సభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

అంగన్‌వాడీల పోరు.. ఉధృతం..ఉద్రిక్తం

భారీగా తరలివచ్చి కలెక్టరేట్ ముట్టడి..

పలుమార్లు చొచ్చుకుపోయేందుకు యత్నం

పోలీసులు కార్యకర్తలకు మధ్య తోపులాట

ఆందోళనకు మద్దతు తెలిపిన దామచర్ల

ఒంగోలు నగరం, జనవరి 3 : అంగన్‌వాడీలు కన్నెర్ర జేశారు. ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. అంగన్‌వాడీల వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు వేలసంఖ్యలో కార్యకర్తలు, ఆయాలు ప్రకాశం భవనంకు తరలివచ్చారు. ఒక్కసారిగా కలెక్టరేట్‌ను ముట్టడించారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. 23 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోగా, వెంటనే విరమించకపోతే ఉద్యోగాలు ఊడుపోతాయంటూ ప్రభుత్వం అల్టిమేటం జారీచేయటంతో వారు కదంతొక్కారు. బుధవారం వేలసంఖ్యలో కలెక్టరేట్ ముట్టడికి వచ్చిన కార్యకర్తలతో రోడ్డంతా కిక్కిరిసిపోయింది. అంగన్‌వాడీల ఆందోళన నేపథ్యంలో కలెక్టరేట్ ఎదుట పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. ఒంగోలు వన్‌టౌన్, టూటౌన్, తాలూకా, శింగరాయకొండ సీఐలు బందోబస్తులో పాల్గొన్నారు. ఉద్యోగులు లోపలికి బయటకు రాకుండా అష్టదిగ్బంధం చేశారు. పరిస్థితిని ముందే గుర్తించిన పోలీసులు రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి అంగన్‌వాడీలను నియంత్రించేందుకు ప్రయత్నించారు. అంగన్‌వాడీల ఆందోళనతో ప్రకాశం భవనం ఎదురు రోడ్డులో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. కలెక్టర్ బయటకు రావాలంటూ అందరూ నినాదాలు చేశారు. కొంత సమయానికి ఐసీడీఎస్ పీడీ వచ్చి బయట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలతో మాట్లాడారు. వెంటనే విధుల్లో చేరాలని ఆమె కోరారు. వేతనాలు పెంచే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీలు తేల్చిచెప్పారు. దీంతో ఆమె కలెక్టరేట్ లోపలికి వెళ్లిపోయారు. కలెక్టరేట్‌లోనికి చొచ్చుకుపోయేందుకు కార్యకర్తలు పలుమార్లు ప్రయత్నించారు. ఈ సందర్భంలో పోలీసులకు, అంగన్‌వాడీలకు మధ్య తోపులాట జరిగింది. దీంతో పలువురికి గాయాలయ్యాయి. మధ్యాహ్నం మూడు గంటల వరకు కలెక్టరేట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. అనంతరం అంగన్‌వాడీలు ప్రదర్శనగా అద్దంకి బస్టాండ్ వరకు వెళ్లి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీల ఉద్యమానికి తెలుగుదేశం పార్టీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ మద్దతు ప్రకటించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్‌రావు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలకు తమ మద్దతు తెలిపి వారినుద్దేశించి మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి రాగానే అంగన్‌వాడీలు డిమాండ్లను నెరవేరుస్తామన్నారు. సమస్యలను పార్టీ అధినేత చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకుపోతానన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి కూడా అంగన్‌వాడీల ఆందోళనకు మద్దతు తెలియజేస్తూ మాట్లాడారు. వీళ్లతోపాటు రైతు సంఘం నాయకులు చుండూరి రంగారావు కూడా మద్దతు ప్రకటించారు. అంగన్‌వాడీల యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నపూర్ణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తమ సత్తా చూపుతామన్నారు. అంగన్వాడీలను నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వాల గతే ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని ఆమె హెచ్చరించారు. ఆందోళనలో సీఐటీయూ నాయకులు జీవి.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు కెవి.సుబ్బమ్మ, ధనలక్ష్మి, శేషమ్మ, క్రాంతి కుమారి, శోభారాణి పాల్గొన్నారు.



ఒంగోలు ధర్నాలో అశేషంగా పాల్గొన్న అంగన్‌వాడీలు

పెండింగ్ ప్రాజెక్టులే ప్రధానాస్త్రం

వెలిగొండ ప్రాజెక్టు సాధన ప్రాంగణంగా పేరు

ప్రజల నుంచి అనూహ్య స్పందన

కనిగిరిలో బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న తెలుగు మహిళలు

ఉగ్ర సారథ్యంలో భారీ ఏర్పాట్లు

ఏడు నియోజకవర్గాల్లోనూ కదులుతున్న కేడర్



వేదికకు భూమి పూజ చేస్తున్న బాలాజీ, ఉగ్ర

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

పేరుకు ఎన్నికల శంఖారావం అయినా జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న ప్రాజెక్టుల సాధన, వైసీపీ ప్రభుత్వ వైఫల్యం, భవిష్యత్తులో టీడీపీ, జనసేన ప్రభుత్వం సాధించబోయే అంశాలను ప్రధానంగా చేసుకుని తెలుగుదేశం పార్టీ కనిగిరి సభకు సన్నాహాలు చేస్తోంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు శుక్రవారం కనిగిరిలో జరిగే బహిరంగసభలో పాల్గొంటున్న విషయం తెలిసిందే. 'రా.. కదలిరా' అంటూ రాష్ట్రంలోని 25 పార్లమెంట్ స్థానాల్లో ఒక్కో సభను నిర్వహించాలని బాబు నిర్ణయించారు. ఆ కార్యక్రమానికి శుక్రవారం కనిగిరిలో శ్రీకారం పలుకుతున్నారు. డాక్టరు ఉగ్రనరసింహారెడ్డి గత ఐదేళ్లుగా పార్టీ కార్యక్రమాల నిర్వహణలోను, ప్రజాసంబంధాల్లోను అగ్రభాగంలో నిలిచారు. గతేడాదిగా అన్నా క్యాంటీన్ నిర్వహణ ద్వారా అశేష ప్రజాదరణ పొందారు. వైద్యసేవా కార్యక్రమాల్లో అగ్రస్థానంలో ఉన్నారు. తద్వారా బాబు, లోకేష్‌లను ప్రత్యేకంగా ఆకర్షించిన డాక్టరు ఉగ్ర ప్రాతినిధ్యం వహించే కనిగిరి నుంచి ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభిస్తుండటం విశేషం.

వెలిగొండే ముఖ్యాంశం


జిల్లాలోని పశ్చిమప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగా సభా ప్రాంగణానికి 'వెలిగొండ ప్రాజెక్టు సాధన' పేరు పెట్టాలని ఉగ్ర అధిష్ఠానానికి సూచించారు. పరిశీలన అనంతరం ఆ పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. అంతేగాక ఒంగోలు లోక్‌సభ పరిధిలోని ఆయా సాగు, తాగునీటి పథకాల విషయంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఈ సందర్భంగా ఎండగట్టాలని టీడీపీ నిర్ణయించుకుంది. చంద్రబాబు సభా కార్యక్రమం ఖరారుకాగానే ప్రజల్లోకెళ్లిన నాయకులకు రేపు మీ ప్రభుత్వంలోనైనా ఈ ప్రాజెక్టులు పూర్తిచేయండి బాబూ అంటూ ప్రజలు సూచన చేయటం అధికంగా కనిపించింది. దీంతో ప్రజల మనోభావాలకు అనుగుణంగా ఆ అంశాలకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించుకున్నారు. కాగా చంద్రబాబు తప్పుడు కేసులో జైలు జీవితం అనుభవించిన తర్వాత తొలిసారి జిల్లాకు వస్తున్నారు. దీంతో యావత్తు ఒంగోలు లోక్‌సభ పరిధిలోని టీడీపీ శ్రేణులు ఆయనను ప్రత్యక్షంగా చూసేందుకు తహతహలాడుతున్నారు. ఎక్కడికి పోయినా పార్టీ కేడర్ మొత్తం తాము సిద్ధం.. తరలివస్తామని నాయకులకు చెబుతుండటం విశేషం. కనిగిరి నియోజకవర్గంలో అయితే చంద్రబాబు కార్యక్రమానికి తరలిరావాలని డాక్టరు ఉగ్ర విస్తృత ప్రచారం చేపట్టారు. నగర పంచాయతీలో తెలుగు మహిళలు ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్నారు. అలాగే ఆయా మండలాల వారీ నాయకులు ప్రతి గ్రామానికి వెళ్లి పార్టీ నాయకులతో సమావేశమై సభకు తరలిరావాలని సూచిస్తున్నారు. ఒక్కో గ్రామంలో పదిమందితోనో ఇరవై మందితోనో సమావేశం కావాలని వెళ్తున్న నాయకులకు గ్రామమంతా ఎదురేగి స్వాగతం పలుకుతుండటం విశేషం. కనీసం 50వేల మందికి పైగా కనిగిరి నియోజకవర్గం నుంచే తరలివచ్చే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్దఎత్తున జనం తరలి వచ్చే అవకాశం ఉంది. టీడీపీ పరంగా కూడా ఆయా నియోజకవర్గాల వారీ పరిశీలకులను పంపి ఏర్పాట్లుని పర్యవేక్షిస్తున్నారు. మంగళవారమే దర్శిలో పత్తిపాటి పుల్లారావు, నారపుశెట్టి పాపారావు టీడీపీ శ్రేణులతో సమావేశం కాగా జనసేన కార్యకర్తలతో ఆ పార్టీ నాయకుడు వెంకట్ సమావేశమై బాబు సభను జయప్రదం చేయాలని కోరారు. వైపాలెంలో ఎరిక్షన్‌బాబు, ఒంగోలులో దామచర్ల జనార్దన్, కొండపిలో ఎమ్మెల్యే స్వామి, గిద్దలూరులో అశోక్‌రెడ్డి, మార్కాపురంలో నారాయణరెడ్డిలు ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించి కనిగిరి సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కనిగిరికి సమీపంలోనే ఉన్నందున కందుకూరు నుంచి ఇంటూరి నాగేశ్వరరావు కూడా భారీగా శ్రేణులతో తరలివచ్చే ప్రయత్నాల్లో ఉన్నారు. దీంతో అంచనాలకు మించి ప్రజలు సభకు హాజరుకావచ్చని భావిస్తున్నారు.

జనసేనకు ఆహ్వానం

మిత్రపక్షమైన జనసేనకు కూడా కార్యక్రమానికి రావాలని టీడీపీ నాయకులు ఆహ్వానం పలికారు. ప్రచార కార్యక్రమంలో టీడీపీతోపాటు జనసేన పేరును ఉచ్చరించటమే గాక అన్ని ప్రచార పోస్టర్లపై చంద్రబాబు, లోకేష్‌తో పాటు పవన్‌కళ్యాణ్ చిత్రపటాన్ని కూడా వేశారు. వేదిక మీదకు ప్రోటోకాల్ ప్రకారం జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్, కనిగిరి అధ్యక్షుడిని ఆహ్వానించాలని నిర్ణయించుకున్నారు.

పెన్షన్ కానుకతో భరోసా

ఎనిమిది రకాల పింఛన్లు రూ.3వేలకు పెంపు



చెక్కులను అందజేస్తున్న కలెక్టర్, బూచేపల్లి, మేయర్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 3 : వైఎస్సార్ పెన్షన్ కానుకతో పింఛన్‌దారులకు భరోసా లభించిందని, ఒకరిపై ఆధారపడకుండా బతుకుతున్నారని, మొత్తం ఎనిమిది రకాల పెన్షన్లను లబ్ధిదారులకు జనవరి 1 నుంచి పెంచిన నగదును కలిపి మూడు వేలను అందిస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. పెంచిన పెన్షన్‌ను ముఖ్యమంత్రి జగన్ కాకినాడ నుంచి రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించగా స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18రకాల పెన్షన్లు ఉండగా జనవరి నెల నుంచి ఎనిమిది రకాల పెన్షన్లు 2,47,638 మందికి పెంచిన నగదుతో కలిపి రూ.74.29కోట్లను పంపిణీ చేస్తామన్నారు. గత డిసెంబరులో మంజూరు చేసిన కొత్త పెన్షన్లు 3,731 మందికి కూడా రూ.1.12కోట్లు పంపిణీ చేశామన్నారు. అన్నిరకాల పెన్షన్‌దారులు 2.97 లక్షల మంది ఉండగా జనవరిలో వారికి రూ.88.98 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈనెల 8వతేదీ వరకు ఈ పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు అనంతరం లబ్ధిదారులకు జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మేయర్ గంగాడ సుజాతతో కలిసి కలెక్టర్ చెక్కులను అందజేశారు.

ఉద్యోగుల తిరుగుబాటు

ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న నిరసనలు

పాలకులపై పోరులో విభిన్న వర్గాలు

23వ రోజూ అంగన్‌వాడీల సమ్మె

వెనక్కితగ్గని మునిసిపల్ కార్మికులు

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల ఆందోళనలు

అదే దారిలో వలంటీర్లు కూడా..

ఇప్పటికే ఆశాల ఆందోళనలు

రెవెన్యూ చట్టంపై న్యాయవాదులు ఆగ్రహం

జగన్ సర్కార్‌పై ఉద్యోగులు తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలు వర్గాల వారు పోరుకు దిగారు. తమ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తాడోపేడో అనే రీతిలో సమ్మెబాట పట్టారు. గ్రామస్థాయిలోని అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు మొదలు మునిసిపల్ కార్మికులు, సమగ్ర శిక్షా ఉద్యోగులు, ఉపాధ్యాయులు చివరకు న్యాయవాదులు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయా వర్గాలకు చెందిన వేలాదిమంది ఆందోళనలు, నిరసనలు చేస్తున్నారు. తాజాగా వలంటీర్లు కూడా రోడ్డెక్కడానికి సిద్ధంగా ఉన్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా పక్షంరోజులుగా ఎటుచూసినా ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు మార్మోగుతుండగా, ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు.

ఒంగోలు, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో దీర్ఘకాలంగా కొద్దిపాటి వేతనం, గౌరవ వేతనం తీసుకుంటూ పలువరు పనిచేస్తున్నారు. ఇలా అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మునిసిపల్ కార్మికులు ఇతర ప్రభుత్వ శాఖల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. అలా జిల్లాలో 50వేలమందికిపైగా పనిచేస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలోనే ఉన్నారు. గత ప్రభుత్వాలు ఆయా సమయానుకూలంగా వారికి వేతనాల పెంపు, ఇతర సౌకర్యాలు అమలు చేసేవి. వారి సమస్యలు పరిష్కారం కోసం ఆందోళనలు, నిరసనలకు దిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరున్నా సానుకూల దృక్పథంతో వ్యవహరించి పరిష్కారానికి చొరవ చూపేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిభిన్నమైన పరిస్థితి నెలకొంది. తమ సమస్యల పరిష్కారం కోసం, హక్కుల కోసం గళం విప్పిన వారిపై కేసులు, వేధింపులతో అణిచివేత అధికమైంది. దీంతో ప్రభుత్వంపై ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం నెలకొంది.

హామీల అమలు మరిచి..

గతంలో వైసీపీ అధినేతగా పాదయాత్ర సమయంలోనూ ఎన్నికల ప్రచారంలోనూ వివిధ వర్గాల వారికి జగన్ ఎడాపెడా హామీలు ఇచ్చారు. అంగన్‌వాడీలు, ఆశాలకు వేతనాలు పెంపు, ఇతర సౌకర్యాల కల్పన, మునిసిపల్ కార్మికులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం వంటి పలు అంశాలపై హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చాక వాటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. నాలుగున్నరేళ్లలో కనీసం ఆ హామీల ఊసెత్తకపోగా అనేకసార్లు సంబంధిత సంఘాల వినతులను కూడా పట్టించుకోలేదు. అలా సమస్యల పరిష్కారానికి చర్యలు లేకపోగా వారిపై పనిభారం పెరిగింది. మరోవైపు కొద్దిపాటి వేతనంతో పనిచేస్తున్న వారిని ఉద్యోగులుగా పేర్కొంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కోత పెట్టారు. దాంతో ఆయా వర్గాలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరుకు విభిన్నవర్గాలు సిద్ధమయ్యాయి.



ఒంగోలు కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలతో ప్రారంభం..

ఈక్రమంలో వామపక్ష కార్మిక సంఘాల నేతృత్వంలో ఉండే పోరాట పటిమ అధికంగా ఉన్న అంగన్‌వాడీలు ముందు వరుసలో పోరుకు దిగారు. తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ జిల్లాలోని 2,903 కేంద్రాలకు చెందిన ఐదువేల మందికిపైగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు సమ్మెబాట పట్టారు. కేంద్రాలు మూసి వారు సమ్మెలోకి వెళ్లి మంగళవారం నాటికి 23 రోజులు పూర్తయింది. ఆలనాపాలనా లేక అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. సచివాలయ ఉద్యోగుల ద్వారా వాటిని నడిపేందుకు ప్రభుత్వం చేపట్టినా చర్యలు ఫలితం ఇవ్వలేదు. మరోవైపు జిల్లాలో విద్యాశాఖ పరిధిలో జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు పాఠశాలలు, విద్యాశాఖ కార్యాలయాల్లో పని చేసే సుమారు 5వేల మందికిపైగా ఎస్ఎస్ఏలోని కాంట్రాక్టు ఉద్యోగులు విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేపట్టారు. వారి సమ్మె తొమ్మిది రోజులకు చేరింది. తాజాగా మునిసిపల్ కార్మికులు గత మంగళవారం నుంచి సమ్మె ప్రారంభించారు. ఒంగోలు కార్పొరేషన్‌తోపాటు మరో ఆరు మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఉన్న రెండున్నరవేల మంది ఒప్పంద, పొరుగు సేవల పారిశుధ్య కార్మికులు, చెత్త రవాణా వాహనాలు నిలిపివేసి సమ్మెకు దిగారు. తాజాగా రెవెన్యూ చట్టంలో తెచ్చిన భూ ట్రిబ్యునల్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ భూసంబంధ రెవెన్యూ కోర్టులను బహిష్కరించారు. దీంతో రెవెన్యూ కోర్టులలో ఉన్న భూవివాదాల పరిష్కారాలు ఆగిపోయాయి. ఇప్పటికే వివిధ రూపాల్లో పెద్దఎత్తున నిరసనలు చేపట్టిన ఆశా వర్కర్లు కూడా చలో విజయవాడ కార్యక్రమానికి, తదుపరి సమ్మెకు సన్నద్ధం అవుతున్నట్లు సమాచారం.

వలంటీర్లు అదే బాటలో..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏర్పాటు చేసిన వలంటీర్లు కూడా ప్రభుత్వం పట్ల తీవ్ర ఆగ్రహంతోనే ఉన్నారు. వారందరిని స్థానిక వైసీపీ నేతల సూచనలకు అనుగుణంగానే నియమించగా 90శాతం మంది వైసీపీ కార్యకర్తలు వంటి వారే. అయినప్పటికీ కొద్దిపాటి గౌరవవేతనం ఇస్తూ అన్ని రకాల పనులు చేయిస్తూ తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న భావన వారిలో ఉంది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో వలంటీర్లు సమ్మెకు దిగుతుండగా ఆ ప్రభావం జిల్లాలో కూడా ఉండే అవకాశం కనిపిస్తోంది. మొత్తం మీద జిల్లాలో పక్షంరోజులుగా ఎటుచూసినా ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ధర్నాలు, ర్యాలీలు, మానవహారాలు, దీక్షలతో దద్దరిల్లిపోతున్నాయి. గురువారం కూడా ఆయావర్గాల వారు భారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. రానున్న రోజుల్లో ఇవి మరింత ఉధృతం కానున్న సంకేతాలు కనిపిస్తుండగా ఎన్నికలవేళ ప్రభుత్వం ఆందోళన చెందుతున్నారు. అదేసమయంలో ఆయా వర్గాల సమ్మెలు, ఇతర ఆందోళనలను కార్మికసంఘాలు, పార్టీలు వెన్నుదన్నుగా నిలుస్తుండగా ప్రతిపక్షమైన టీడీపీ నేతలు సంపూర్ణ మద్దతు ఇచ్చి అండగా నిలుస్తోంది.



ధర్నా చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

పోటీ చేద్దామా.. వద్దా?

సమాలోచనల్లో శిద్దా

కుటుంబ సభ్యులు, సన్నిహితులతో ఎడతెగని చర్చలు

అత్యధికుల నుంచి వ్యక్తంకాని సానుకూలత

రేపు సీఎంకు తుది నిర్ణయం చెప్పే అవకాశం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేయాలా? వద్దా? అన్న అంశంపై మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఆయన కుమారుడు సుధీర్ ముమ్మర సమాలోచనల్లో మునిగిపోయారు. వైసీపీ అభ్యర్థిగా ఒంగోలు అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేయాలని సుధీర్‌ను సీఎం జగన్ ఆదేశించడం, ఆలోచించుకుని రెండు రోజుల్లో నిర్ణయం చెబుతామని రాఘవరావు, సుధీర్ చెప్పి రావడం విదితమే. దీంతో వారిద్దరూ రెండురోజులుగా ఇటు కుటుంబ సభ్యులు, అటు సన్నిహితులు, శ్రేయోభిలాషులతో సమావేశమై అందరి అభిప్రాయం తెలుసుకుంటున్నారు. అయితే ఇప్పటివరకూ అందిన సమాచారం ప్రకారం అత్యధికులు 'మీరు రిస్క్‌చేయడం అనవసరం' అన్న అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

అందరి అభిప్రాయాల సేకరణ

వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతో పోటీచేసే అభ్యర్థులను సీఎం జగన్ మారుస్తున్నారు. అందులో భాగంగా ఒంగోలు సిటింగ్ ఎమ్మెల్యే బాలినేని పేరును గిద్దలూరుకు పరిశీలిస్తున్నారు. ఆయన స్థానంలో ఒంగోలు నుంచి శిద్దా సుధీర్‌ను పోటీచేయాలని కోరారు. దీంతో శిద్దా కుటుంబం డైలమాలో పడిపోయింది. పోటీ విషయమై మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమైన వారి సమాలోచనలు బుధవారం కూడా కొనసాగాయి. కుటుంబసభ్యుల్లో ముఖ్యులందరి అభిప్రాయం తెలుసుకునే ప్రయత్నం చేశారు. వ్యాపారపరంగా కూడా తనతో సంబంధం ఉన్న వివిధ వర్గాల వారి అభిప్రాయం కూడా తెలుసుకున్నారు. పార్టీలకతీతంగా ఉన్న సన్నిహితులు, శ్రేయోభిలాషులను కూడా నేరుగా, ఫోన్లలో సంప్రదించారు. శుక్రవారం తమ నిర్ణయాన్ని తెలియజేస్తామని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. ఏదైనా చెప్పిన సమయానికి తెలియజేయాలని సీఎం వారికి గట్టిగా సూచించినట్లు తెలిసింది. దీంతో శుక్రవారం నిర్ణయాన్ని సీఎంకు తెలియజేసే ఉద్దేశంతో ఉన్నారు. ఇటు ప్రజాభిప్రాయంతోపాటు వారు విశ్వసించే పీఠాధిపతులు, సిద్ధాంతుల సలహాలు కూడా తెలుసుకుంటున్నట్లు తెలిసింది. అందిన సమాచారం మేరకు అసలు లోక్‌సభ నుంచి ఎంపీ మాగుంట పోటీచేస్తున్నారా? బాలినేనిని ఇక్కడ నుంచి ఎందుకు మార్చారు? అనే విషయాలను మీరు పరిశీలించుకోవాలని ఎక్కువ మంది సూచించినట్లు తెలిసింది. రాష్ట్రంలో వాతావరణం కూడా అధికారపార్టీకి సానుకూలంగా లేదని చెప్పినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో మీరు రిస్క్‌చేయాల్సిన అవసరం లేదని అత్యధికులు సూటిగా చెప్పారు. అయితే రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉందన్న భావనతో శిద్దా, ఆయన కుమారుడు ఉన్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి జగన్‌తో ఏర్పడిన సన్నిహిత సంబంధాలను దృష్టిలో ఉంచుకుని కూడా వారు ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న విషయంలో ఇబ్బందిపడుతున్నట్లు తెలిసింది.

మాగుంట పేరు ప్రస్తావించని సీఎం

సీఎం మంగళవారం శిద్దా, సుధీర్‌తోపాటు చంద్రశేఖర్‌తో మాట్లాడేటప్పుడు కూడా ఎంపీ మాగుంట పేరును ఒక్కసారి కూడా ఉచ్చరించలేదని తెలిసింది. ఎంపీ అభ్యర్థి విషయం ఒకసారి ప్రస్తావనకు రాగా 'రెడ్డి సామాజికవర్గానికి అవకాశం ఇస్తాం. సత్యనారాయణ రెడ్డి (రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్) లాంటి వారు చాలామంది పోటీకోసం సిద్ధంగా ఉన్నారు' అని వ్యాఖ్యానించినట్లు సమాచారం. మాగుంట పేరును ప్రస్తావించకుండా కొందరి వద్ద ఇలా సత్యనారాయణరెడ్డి లాంటి వారి పేర్లను ఉచ్చరించటం అడపాదడపా వైవీ సుబ్బారెడ్డి పేరును చెబుతుండటం వైసీపీ నాయకుల్లో చర్చనీయాంశమైంది. ఒంగోలుకు సుదూరంగా ఉన్న గిద్దలూరులో బాలినేని పోటీచేసి ఎంపీగా మాగుంట కూడా లేనప్పుడు మనకు ఇక్కడ పోటీచేయడం అవసరమా అని శిద్దా కుటుంబానికి బంధువర్గం నుంచి సూచనలు అందినట్లు తెలిసింది.

రోడ్డుప్రమాదంలో తండ్రీకొడుకుల మృతి

బైకును ఢీకొట్టిన కారు





ప్రమాదస్థలంలో దెబ్బతిన్న కారు, బైక్.. మృతులు తండ్రి బుజ్జి, కొడుకు శివ ఫణీంద్ర

మార్కాపురం రూరల్, జనవరి 3 : బైకును కారు ఢీకొట్టిన ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం మండలంలోని తిప్పాయపాలెం, జంగంగుంట్ల మధ్య జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కంభంకు చెందిన సొరకాయల బుజ్జి (35) కారు డ్రైవర్. ఆయన పెద్దకుమారుడు శివఫణీంద్రకుమార్ (10)కి అనారోగ్యంగా ఉండటంతో బైక్‌పై మార్కాపురంలోని ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యుడికి చూపించుని తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. తిప్పాయపాలెం, జంగంగుంట్ల గ్రామాల మధ్యకు వచ్చే సరికి ఎదురు వేగంగా వచ్చిన కారు వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తండ్రీకొడుకులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. బుజ్జికి భార్య, మరో కుమారుడు ఉన్నారు. మృతిచెందిన పెద్దకుమారుడు శివఫణీంద్ర 3వ తరగతి చదువుతున్నాడు. తండ్రీకొడుకుల మృతితో ఆ కుటుంబంలో విషాదచాయలు అలముకున్నాయి. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని మార్కాపురం రూరల్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.


అద్దంకిలో రోడ్డుపై పడుకుని దండం పెడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కార్మికుల పొట్టగొట్టే విధానాలను మానుకోవాలి

అద్దంకిటౌన్, జనవరి 3: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు వారి డిమాండ్ల సాధనకోసం సమ్మె చేస్తుంటే సమస్యను పరిష్కరించకుండా కూలీలతో పారిశుధ్య పనులు చేయిస్తూ కార్మికుల పొట్టగొట్టే విధానాలను ప్రభుత్వం మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె బుధవారానికి 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో కార్మికులు బోర్లాపడుకుని, దండం పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పెనుబాక ఆదాము, గాలి బీష్మా, బత్తుల కృష్ణ, దానరి వీరయ్య, యర్రమోతు సుబ్బయ్య, మాలెపోగు అంజమ్మ, దానరి అలివేలు పాల్గొన్నారు.


ఒంటి కాలుపై నిల్చొని నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ఒంటి కాలుపై నిల్చొని పారిశుధ్య కార్మికుల నిరసన

చీరాల, జనవరి 3: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె, నిరసన కార్యక్రమాలు రోజు, రోజుకు ఉధృతమవుతున్నాయి.ఆ క్రమంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న దీక్ష శిబిరంలో పారిశుధ్య కార్మికులు ఒంటికాలుపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారికి మద్దతుగా పాల్గొన్న సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎన్. బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి వీడకుంటే, వారి కళ్ళు తెరిపించేవరకు ఉద్యమం, సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, వారి మద్దతుదారులు పాల్గొన్నారు.


వాహనాలలో విజయవాడకు తరలివెళ్తున్న భవానీ దీక్షాధారులు

భవానీల ఇరుముడుల కార్యక్రమం

చినగంజాం, జనవరి 3 : మండలంలోని పల్లెపాలెం, మహాలక్ష్మి కాలనీలలో భవానీల ఇరుముడుల కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. పల్లెపాలెం గ్రామంలోని రామాలయంలో గ్రామానికి చెందిన 24 మంది భవానీలు, చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మి కాలనీకి చెందిన 10 మంది భవానీలకు మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురుభవానీ సైకం ఏడుకొండలు ఆధ్వర్యంలో ఇరుముడుల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామాలయం, మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41 రోజులు కనకదుర్గ అమ్మవారి దీక్ష పూర్తి చేసుకుని, అమ్మవారికి ఇరుముడులు చెల్లించుకునేందుకు 34 మంది భవానీలు పల వాహనాల్లో విజయవాడ బయలుదేరి వెళ్లారు. భవానీలకు కుటుంబసభ్యులు, బంధువులు వీడ్కోలు పలికారు.


టీఎన్ఎస్ఎఫ్ అద్దంకి నియోజకవర్గ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

టీఎన్ఎస్ఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

అద్దంకిటౌన్, జనవరి 3: టీఎన్ఎస్ఎఫ్ అద్దంకి నియోజకవర్గ నూతన సంవత్సర క్యాలెండర్‌ను అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ బుధవారం బలికురవపాడులోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై టీఎన్ఎస్ఎఫ్ పోరాడి వారి సమస్యల పరిష్కారానికి విద్యార్థులతో కలిసి కృషి చేయాలని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు, విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ ప్రెసిడెంట్ ముల్లూరి మహేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి శ్రావణ్, ఉపాధ్యక్షుడు రాజా, కార్యదర్శి ఎస్‌కె.పర్వేజ్ అన్వర్, బొంతు ఏసుబాబు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


ముక్తేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టిన మోటారు పైపులు

ముక్తేశ్వరం పాఠశాలలో వాటర్ పైపులు ధ్వంసం

బల్లికురవ, జనవరి 3 : మండలంలోని ముక్తేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గేటు తాళాలు పగులగొట్టి వాటర్ పైపులైన్‌ను ధ్వంసం చేశారు. బుధవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు పైపులైను పగులగొట్టి ఉండటాన్ని గమనించి వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఏడాది గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలోకి వచ్చేందుకు గేటు తాళాలు పగలగొట్టి లోపల తరగతి గదుల తాళాలు పగల గొట్టేందుకు ప్రయత్నించి వారికి వీలు పడకపోవడంతో బయట ఉన్న మోటార్‌కు చెందిన పైపులను కోసి వేశారని, ప్రజల అలికిడితో పరారై ఉంటారని గ్రామస్థులు తెలిపారు. పాఠశాలలో విలువైన వస్తువులు ఉన్నందున పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిబాబు తెలిపారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ చిరంజీవి పాఠశాలలో జరిగిన ఘటనపై పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు.

వైసీపీ కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలి

అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్


మార్టూరు సమీపంలోని జొన్నతాళిలో మణికేశ్వరం, శింగరకొండపాలెం టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకిటౌన్, జనవరి 3: అధికార పార్టీ చేస్తున్న కుట్రలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు క్షేత్ర స్థాయిలో టీడీపీ నాయకులు, ఓటర్లు, ప్రజలు తమ వంతుగా కృషి చేయాలని అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ సూచించారు. బుధవారం మార్టూరు సమీపంలోని జొన్నతాళిలో మండలంలోని మణికేశ్వరం, శింగరకొండపాలెం గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలను ఆయా గ్రామాల నాయకులు , కార్యకర్తలకు సూచించారు. ఓటరు పేజీ నేస్తం పేరుతో 60 మంది ఓటర్లకు ఒక కలిసి సెక్షన్ ఇన్‌చార్జిగా 6 మంది ప్రతి నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ క్రియాశీలకంగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా ఓటరు పేజీ నేస్తంగా 23 మందిని ఎంపిక చేయడం పట్ల అభినందించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమ్మకు వందనం పేరుతో ఇంటిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నా వారందరికి సంవత్సరానికి రూ. 15 వేలు, యువగళం నిధికింద యువతకు నెలకు రూ. 3 వేలు, ప్రతి రైతుకు రూ. 20వేలు ఆర్థిక సాయం, బీసీలకు రక్షణ చట్టం, దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహాశక్తి కింద 18 నుంచి 59 సంవత్సరాల ప్రతి మహిళకు 1500 రూపాయలు అందజేసే పథకాలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలలో తీసుకువెళ్లాలని సూచించారు. అలాగే ఓటరు జాబితాలపై ఎప్పటికప్పుడు అందరు అప్రమత్తంగా ఉండాలని, అందరు కలిసి కట్టుగా పనిచేసి పార్టీ అధికారంలోకి రావడానికి అందరు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా హోదాలు కలిగిన టీడీపీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో సెయింట్ ఆన్స్‌లో ముగ్గుల పోటీలు

చీరాల, జనవరి 3 : ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు - పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగుళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన వారు సంయుక్తంగా సెయింట్ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న ముత్యాల ముగ్గుల పోటీలు శుక్రవారం ఉదయం 9 గంటలకు సెయింట్ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల(ఆటానమస్)లో జరుగుతున్నాయి. ఈ పోటీలలో పాల్గొన దలచిన వారు ముందస్తుగా ఆంధ్రజ్యోతి దినపత్రికలో వస్తున్న ప్రకటనలోని ఫోన్ నెంబర్లకు తమ పేరు, చిరునామాతో రిజిస్టర్ చేసుకోవాలి. పోటీలలో పాల్గొన్న వారికి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు అందించనున్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతి ఇస్తామన్నారు. 5వ తేదీ శుక్రవారం జరిగే ఈ పోటీలకు హాజరయ్యే మహిళలు సెయింట్ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల బస్సులలో కాలేజీకి రావచ్చు. స్థానిక రైల్వేస్టేషన్, బస్టాండ్ కూడలి, పేరాల కూడలి, నల్లగాంధీబొమ్మ కూడలి , కొత్తపేట కూడలి కళాశాల బస్సులలో ఎక్కి రావచ్చు. అలాగే పోటీల అనంతరం పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన మహిళలను తిరిగి వారు ఎక్కిన ప్రదేశాల్లో దింపే సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీలలో పాల్గొనే మహిళలు అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. పేర్ల రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు సెల్ నెంబర్లు 99490 73369, 93903 07829, 99854 11491 నెంబర్లలో సంప్రదించగలరు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి


చీరాల టీడీపీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కొండయ్య

అద్దంకిటౌన్, జనవరి 3: సావిత్రిబాయి పూలే కృషి వలన సామాజిక దురాచారాలకు బలికాకుండా ఎందరో బాలికలు చదువుకుంటున్నారని, మరెందరో మహిళలు ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారని పలువురు వక్తలు అన్నారు. భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే 193వ జయంతి సందర్భంగా పలు పాఠశాలలో, వివిధ సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శింగరకొండ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం అధ్యక్ష, కార్యదర్శులు మలాది శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, ట్రెజరర్ భువనేశ్వరి, మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు. దేవపాలన ముఖ్య అతిథిగా హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌లో హెచ్ఎం కోటా అంజమ్మ ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని సావిత్రిబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో..

బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, బీఎస్పీ నియోజకవర్గ నాయకులు మంద జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల టీడీపీ కార్యాలయంలో

చీరాల : స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


పర్చూరులో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నేతలు

ఆదర్శ మహిళ సావిత్రిబాయ్ పూలే

పర్చూరు, : బడుగు బలహీన దళిత మైనార్టీ వర్గాల అమ్మాయిలకు లక్ష్యంగా విద్యను బోధించిన సావిత్రి బాయ్ పూలే కృషి యనేలేనిదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవి కుమార్ పేర్కొన్నారు. బుధవారం పర్చూరు బొమ్మల సెంటర్‌లో సావిత్రిబాయ్ పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జన్యదుల వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్‌సీపీ రాజు, బంకా మాధవరావు, కారుమంచి రామాంజనేయులు, అంగలకుదురు నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం


సావిత్రి బాయిపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చినగంజాం, జనవరి 3 : మండలంలోని పలు పాఠశాలల్లో భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయిఫూలే 193వ జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయిఫూలే జయంతిని పురస్కరించుకొని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్.ఎం లు కుర్రా రామారావు, మల్లారెడ్డిలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సావిత్రిబాయి పూలేని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. దేశ మొదటి మహిళా ఉపాధ్యాయిని, రచయిత, సంఘ సంస్కర్త అయిన సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా గౌరవిస్తున్నామన్నారు. మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాల మహిళా ఉపాధ్యాయురాలైన పి.హేమవంతశ్రీని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హెలెన్‌రూత్, కే.రామారావు, పూజా కవిత, ఎస్.ప్రసాద్, షేక్.జరీనాతాజ్, ఎస్.ఓ.శివయ్య, ఎస్.త్రిపురాంతకరావు, సంపత్‌కుమార్, వెన్నెల, అరుణకుమార్, పి.లక్ష్మి, పి.డి.జె.దేవవిక్రమ్, విద్యార్థులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరేందుకు విజయవాడ తరలివెళ్తున్న వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తల వాహనాలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కొండయ్య

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే బలరాం


లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బలరాం

చీరాల, జనవరి 3 : ప్రభుత్వ పరంగా అందిస్తున్న పెన్షన్లను, ప్రభుత్వ సా యాన్ని లబ్ధిదారులు సద్వి నియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఎన్‌ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో బుధవారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరాం, ఆర్డీవో సరోజిని తదితరులు మాట్లాడుతూ దశల వారీగా పెన్షన్ పెంపునకు చేపట్టిన ప్రభుత్వ విధానాన్ని, సీఎం జగన్ చర్యలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ల బొగ్గుల జైసన్ బాబు, శిఖకొల్లి రామసుబ్బులు, పలువురు కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి ... అదే మన నినాదం

● **టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య**

చీరాల, జనవరి 3 : వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు గెలిచి చంద్రబాబు మరలా ముఖ్యమంత్రి కావాలని అదే మన నినాదమని, అందుకు కార్యోన్ముఖులై పనిచేద్దామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి బుధవారం వివిధ పార్టీల నుంచి టీడీపీలోకి చేరేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలతో కొండయ్య మాట్లాడారు. అనంతరం చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరేందుకు వచ్చిన వారు ప్రత్యేక బస్సుల్లో తాడేపల్లికి బయలుదేరేందుకు కొండయ్య జెండా ఊపి వాహనాలు కదిలించి బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

అద్దంకిటౌన్, జనవరి 3: ప్రస్తుతం ఉన్న అద్దంకి నియోజకవర్గం, 2024 తరువాత నియోజకవర్గాన్ని నేను ఏవిధంగా అభివృద్ధి చేస్తానో ప్రజలందరు మాదాలని వైసీపీ అద్దంకి ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి అన్నారు. బుధవారం అద్దంకి మున్సిపల్ కార్యాలయం వద్ద వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా నూతనంగా మంజూరు అయిన పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు.ముందుగా సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆ మె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో హనిమిరెడ్డి మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, కమిషనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వఉంచిన రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడ్డ రేషన్ బియ్యంతో అధికారులు

కారంచేడు(పర్చూరు), జనవరి 3: కారంచేడు గ్రామంలోని షాపు నెంబరు 3లో అక్రమంగా నిల్వ ఉంచిన 24 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు బుధవారం పట్టుకున్నారు. బియ్యం అక్రమంగా నిల్వఉన్న సమాచారంతో బాపట్ల జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. రేషన్ దుకాణంలో అక్రమంగా నిల్వఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని షాపు యజమానిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు పౌరసరఫరాలశాఖ డీటీ ఓంకార్ తెలిపారు. ఊంతోపాటు బియ్యాన్ని తరలించేందుకు దుకాణం వద్ద ఉంచిన వాహనాన్ని కూడా సీజ్‌చేసినట్లు అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో డీటీ అనిత, ఫుడ్ఇన్‌స్పెక్టర్ కిషోర్, వీఆర్వో విమలకు పాల్గొన్నారు.

కూలీలకు గ్రామాలలోనే పనులు కల్పించాలి


ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో బ్రహ్మయ్య

బల్లికురవ, జనవరి 3 : రోజువారీ కూలీలు గ్రామాల నుంచి వలస పోకుండా పనులు కల్పించాలని ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య కోరారు. బుధవారం బల్లికురవ ద్వామా కార్యాలయంలో అన్ని గ్రామాల ఉపాధి హామీ పథక సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ ఏడాది గ్రామాలలో ఉపాధి పనులను గుర్తించాలని, కూలీలకు వంద రోజుల పని దినాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపీవో బాలకృష్ణనాయక్ తదితరులు ఉన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న వన్‌టౌన్ ఎస్సై జానీబాషా

కొత్తపాలెం(చీరాలటౌన్), జనవరి 3 : మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చీరాల మండల పరిధిలోని కొత్తపాలెంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జెర్సిపోగు సంసోన్(48)కు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. సంసోన్ బేల్దారి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతకొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడు. ఈక్రమంలో కుటుంబంలో మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. దీంతో ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఎస్సై జానీబాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రానైట్ క్వారీలలో ముడిరాళ్లకు నంబర్లు కేటాయింపు

బల్లికురవ, జనవరి 3 : మండల పరిధిలోని వీర్ల కొండ వద్ద గల పలు గ్రానైట్ క్వారీలను బుధవారం బాపట్ల జిల్లా మైనింగ్ ఏడీ రాజశేఖర్‌కుమార్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వారు క్వారీలలో వెలికి తీసిన ముడిరాళ్లు అక్రమ మార్గంలో తరలించకుండా ఉండేందుకు యాడీబీ నెంబర్లను కేటాయించారు. సత్యకృష్ణ, ఇంపీరియల్, శ్రీనివాస, ఎస్‌ఆర్ గ్రానైట్ క్వారీలలో ఉన్న ముడిరాళ్లను పరిశీలించి వాటి రాళ్లకు నెంబర్లను కేటాయించారు. అన్ని క్వారీలలో ఇదే పద్ధతి కొనసాగించేలా మైనింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. గతంలో లేని పద్ధతిని అమలు చేయటంపట్ల పలువురు గ్రానైట్ క్వారీల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టరేట్ ముట్టడికి భారీగా వెళ్లిన అంగన్‌వాడీలు


వాహనంలో బాపట్లకు తరలివెళుతున్న అంగన్‌వాడీలు

అద్దంకిటౌన్, జనవరి 3: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు బుధవారం ఉదయాన్నే బాపట్ల జిల్లా కలెక్టరేట్ ముట్టడికి ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. ఐసీడీఎస్ కొరిశపాడు ప్రాజెక్టు పరిధిలోని అద్దంకి, కొరిశపాడు, పంగులూరు మండలాల నుంచి అంగన్‌వాడీలు, ఆయాలు తరలి వెళ్లారు.

బల్లికురవ నుంచి

బల్లికురవ : నిరవధిక సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్ ముట్టడికి తరలి వెళ్లారు. తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని వారు రోజుకో రకంగా నిరసన తెలియజేస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు గురిచేసినా తాము తగ్గేదిలేదని అంగన్ వాడీ కార్యకర్తలు తెలిపారు. తరలి వెళ్లిన వారిలో సంఘ నేతలు నాగమణి, సునంద, నిర్మల, శివ పావని, వెంకటరమణ, చిన్నమ్మాయి తదితరులు ఉన్నారు.

కాంగ్రె్స్‌ను బలోపేతం చేద్దాం

- కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం


శామ్యూల్ మోజెస్‌తో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం


చీరాల, జనవరి 3: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని, అందుకు అవసరమైన అన్ని చర్యలు అందరిని కలుపుకుపోదామని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. స్థానికంగా బుధవారం నియోజకవర్గంలో ఆయన పలువురిని కలిశారు. అందులో భాగంగా గతంలో కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక కార్యకర్త, ప్రస్తుతం వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నీలం శామ్యూల్ మోజెస్‌ను శీలం కలిశారు. అందులో భాగంగా మోజెస్‌తో ఆయన పలు చర్చలు జరిపారు. ఆ క్రమంలో దళిత క్రైస్తవులు, చీరాల నియోజకవర్గంలో వారికున్న ప్రాధాన్యత, ఓటు, ప్రాధాన్యత సరళి తదితర అంశాలను చర్చించారు. ఆ క్రమంలో కాంగ్రెస్ పార్టీలో పునఃప్రవేశం చేయాలని మోజెస్‌కు ప్రతిపాదించగా అందుకు తన వర్గీయుల అందరితో మాట్లాడుకుని అంతిమ నిర్ణయం వారం, పది రోజుల్లో చెప్తానని చెప్పినట్లు తెలిసింది.

వైసీపీ ప్రభుత్వానికివే చివరి రోజులు

పూనూరులో టీడీపీ కార్యాలయ ప్రారంభంలో ఎమ్మెల్యే ఏలూరి


పూనూరులో బుధవారం రాత్రి టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

యద్దనపూడి(మార్టూరు), జనవరి 3 : జగన్ వ్యక్తిగత పాలన సాగిస్తున్నారని, ఇక వైసీపీ ప్రభుత్వానికి ఇవే చివరి రోజులని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని పూనూరు గ్రామంలో టీడీపీ నూతన కార్యాలయాన్ని బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు రంగయ్యచౌదరి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్‌ను వైసీపీ కాల రాసిందని ధ్వజమెత్తారు. కోటి ఆశలతో ప్రజలు జగన్‌మోహనరెడ్డికి అధికారంకట్టబెడితే ఆయన సంపాదన కోసం వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేసి అరాచకాన్ని సృష్టించారన్నారు. ఇసుక, మద్యం, బియ్యం దోపిడీ మొదలుకుని ఖనిజ సంపాదన దోచుకుంటున్నారని వివరించారు. టీడీపీ పాలనలో రైతు లకు స్వర్ణ యుగంలా మారిందని, వైసీపీ పాలనలో రైతులకు సాగునీరు అందని దుస్థితి నెలకొందని అన్నారు. నేడు వైసీపీ పాలనలో ప్రజలు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. ఆరు నెలల్లో పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసి చరిత్ర సృష్టించిన ఘనత టీడీపీదేనని అన్నారు. తొలుత విగ్నేశ్వర వేణుగోపాల స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బోయపాటి సాంబయ్య, సీనియర్ నాయకులు రావిపాటి సీతయ్య, బత్తుల రాము, వీరపనేని వాసు, తల్లపనేని సుధాకర్, ఈదల అనిల్, బత్తుల కృష్ణవేణి, వంకాయలపాటి సుబ్బారావు, పావులూరి శివాజీ, నాగేశ్వరరావు, తారక రామారావు, సతీష్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీలకు ఆహార పదార్థాలు చేరాలి : కలెక్టర్

నెల్లూరు (వైద్యం), జనవరి 3 : జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఆహార పదార్థాలు గురువారం సాయంత్రానికి చేరాలని కలెక్టర్ హరినారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టర్ వెబ్ ఎక్స్ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడారు. శుక్రవారం బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందించాల్సి ఉందని, దీనికి అనుగుణంగా బియ్యం, పప్పు, గుడ్లు, నూనె ఆయా కేంద్రాలకు చేర్చాలన్నారు. వీటి పర్యవేక్షణ బాధ్యతను ఎంఆర్‌వో, ఎంపీడీవోలు చేపట్టాలని సూచించారు.

అక్కాచెల్లెళ్లు అంటూనే మోసం చేస్తారా!?

మూడు వారాలుగా సమ్మె చేస్తుంటే స్పందించరేం
ఇచ్చిన హామీలు జగన్ నెరవేర్చాలి
అంతవరకు మా సమ్మె ఆగదు
స్పష్టం చేసిన అంగన్‌వాడీలు

నెల్లూరు (వైద్యం) జనవరి 3 : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మె ఉగ్రరూపం దాల్చుతోంది. 23 రోజులుగా ఆందోళన చేస్తున్నా పాలకుల నుంచి ఎటువంటి స్పందన లేకపోగా ఆంక్షలు విధించడమై భగ్గుమంటున్నారు. క్షేత్రస్థాయిలో శిశు పోషణ, గర్భిణులకు ఆరోగ్యం, పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. అలాంటి వారికి ఎలాంటి ఉద్యోగ భద్రత, గౌరవప్రదమైన జీతం మాత్రం అందడం లేదు. జీవో నెం.18 ప్రకారం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 2018లో అంగన్‌వాడీల వేతనం రూ.10,500, మినీ అంగన్‌వాడీలు, హెల్పర్లకు వేతనం రూ.7వేలు చేసింది. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక జీవో నెం.13 జారీ చేస్తూ అంగన్‌వాడీల వేతనం మరో రూ.1000 పెంచింది. గత డిసెంబరులో 12వ తేదీన అంగన్‌వాడీల సమ్మె చేపట్టడంతో ఇప్పటికే రూ.4500 పెంచినట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీనిపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోగా ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేయడంపై మండిపడుతున్నారు. జిల్లాలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 5400 మంది అంగన్‌వాడీలు పని చేస్తున్నారు.



"ఎన్నికల ముందు అక్కా చెల్లెమ్మలకు ఇస్తున్న వేతనం సరిపోదన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ జీతాలు ఇస్తామని ఆశ పెట్టారు. తీరా ఇప్పుడు ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్ విస్మరించారు. మూడు వారాలుగా సమ్మె చేస్తుంటే కనీస స్పందన లేదు. అక్కా చెల్లమ్మలకు ఇచ్చే గౌరవం ఇదేనా!?. మా న్యాయమైన డిమాండ్లు సాధించే వరకు బిగిసిన పిడికిలిని వదలం"

- 'ఆంధ్రజ్యోతి'తో అంగన్వాడీ కార్యకర్తలు

డిమాండ్లు ఇవే!

- కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి.
- మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. మినీ అంగన్‌వాడీ వర్కర్లకు పదోన్నతి కల్పించాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, ఆఖరి వేతనంలో 50 శాతం పెన్షన్ ఇవ్వాలి.
- హెల్పర్ల పదోన్నతుల్లో నిబంధనలు రూపొందించాలి. రాజకీయ జోక్యం అరికట్టాలి. సర్వీసులో మరణించిన అంగన్‌వాడీ కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలి. రూ.10 లక్షల బీమా అమలు చేయాలి.
- ప్రభుత్వ ఉద్యోగుల్లా పదవీవిరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలి. వేతనంతో కూడా మెడికల్ లీవ్‌లు ఇవ్వాలి.
- వైఎస్సార్ సంపూర్ణ మెనూ చార్జీలు పెంచాలి. పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, టీఏ బిల్లులు, ఇతర బకాయిలు చెల్లించాలి.
- ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేసి నాణ్యమైన సరకులు అందించాలి. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలి.
- మూడు యాప్‌లు రద్దు చేసి ఒకే యాప్‌ను అమలు చేయాలి.

ప్రభుత్వం వైఖరి మారాలి



23 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం ఇంతవరకు సానుకూలంగా స్పందించక పోవటం దుర్మార్గం. ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలపై పోలీసులు వ్యవహరించిన తీరు కూడా సరికాదు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతోనే ఇలా చేశారని భావిస్తున్నాం. ఇప్పటి కైనా ప్రభుత్వం తీరు మార్చుకుని సానుకూలంగా చర్చలు జరపాలి.

- సుజాత, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

మా కష్టానికి ఫలితం ఇదా!?



అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నాం. గర్భిణులనూ ఆదుకుంటున్నాం. ఎంతోమంది తల్లులు మా కేంద్రాలలో పిల్లలను వదిలి వెళుతున్నారు. వారి ఆలనా పాలన కూడా చూస్తున్నాం. ఇంతగా కష్టపడుతున్నా మాకు ఇచ్చే వేతనం కేవలం రూ.10,500. ఇంత తక్కువ జీతంతో కుటుంబ పోషణ ఎలా!? తెలంగాణా తరహాలో వేతనాలు పెంచి జగన్ ఇచ్చిన **హామీలు అమలు చేయాలని కోరుతున్నాం.**

- వసంత, ఉలవపాడు

ఇలాంటి దమనకాండ సరికాదు



అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వం దమనకాండ కొనసాగిస్తోంది. కేంద్రాల తాళాలు పగలగొడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. న్యాయమైన సమస్యలపై పోరాటం చేస్తుంటే ప్రభుత్వం ఇంత వరకు సానుకూల చర్చలు జరపలేదు. సమ్మెలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- శ్రీదేవి, కొండాపురం

మా మొర వినండి.. కనండి !



నాడు ప్రతిపక్ష నేత హోదాలో జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు ఏ మూలకు సరిపోవన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత తెలంగాణ రాష్ట్రం కంటే అధికంగా వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆయన మాటలు నమ్మి 2019 సాధారణ ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపిస్తే ఇప్పుడు మా మొర వినడం లేదు. కనీసం స్పందించడం లేదు. ఇదేనా జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల పట్ల చూపే ప్రేమ, అభిమానం. ఇప్పటికైనా న్యాయమైన మా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం.

- పి రాధ, అంగన్‌వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఆత్మకూరు

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం



అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యం కొనసాగుతుంది. ప్రభుత్వ అదిరింపులు, బెదిరింపులకు భయపడం. కనీస వేతనం, వేసవి సెలవులు, మినీ అంగన్‌వాడీలను మేజర్ కేంద్రాలుగా మార్చడం, గ్రాట్యుటీ తదితర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్న మాపై ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. సమ్మెలోకి వెళ్లి మూడు వారాలు దాటినా ప్రభుత్వ స్పందించక పోవటం దారుణం.

- కె రమణమ్మ, సెక్టార్ లీడర్, ఆత్మకూరు



అప్పుల పాలవుతున్నాం



అంగన్‌వాడీలంతా పేద కుటుంబాలకు చెందిన వారే. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తు న్నాం. కూరగాయలు, వంట గ్యాస్ బిల్లులు సక్రమంగా ఇవ్వక పోవటంతో అప్పుల పాలవుతున్నాం. అహర్ని శలు శ్రమిస్తున్న మమ్మల్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోంది. ఇచ్చిన హామీలను నెరవేర్చమని కోరుతున్నా సీఎం జగన్ పట్టించుకోవడం లేదు.

- యేనరాతి సావిత్రి, కావలి



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం చేస్తూ..

అంగన్‌వార్!

కలెక్టరేట్‌ను చుట్టిముట్టిన అంగన్‌వాడీలు
బారికేడ్లతో అడ్డుకున్న పోలీసులు
సాయంత్రం వరకు బైఠాయించి నిరసన
సమస్యల పరిష్కారానికి నేటి సాయంత్రం వరకు గడువు
లేకుంటే, సమ్మె మరింత ఉధృతం
తేల్చి చెప్పిన నేతలు, ప్రజాసంఘాలు

నెల్లూరు (వైద్యం), జనవరి 3 : డిమాండ్ల సాధనే లక్ష్యంగా అంగన్వాడీ కార్యకర్తలు నడుం బిగించారు. మూడు వారాలుగా తాము సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడంపై నారీలోకం భగ్గుమంది. బుధవారం జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్వాడీలు తరలివచ్చి కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించారు. అయితే, కలెక్టరేట్ ప్రధాన ముఖద్వారం నుంచి 100 అడుగుల వరకు ముళ్ల కంచె, బారికేడ్లు ఏర్పాటు చేసి ఆందోళనకారు లను అడ్డుకున్నారు. దీంతో సాయంత్రం 4 గంటల వరకు అక్కడే బైఠాయించి, రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ముందుగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో నగరంలోని ఏబీఎం కాంపౌండ్ నుంచి గాంధీబొమ్మ, అంబేడ్కర్ విగ్రహం మీదుగా కలెక్టరేట్ వద్దకు ప్రదర్శనగా చేరుకున్నారు. అనంతరం జరిగిన ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ ప్రభుత్వం విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించకుంటే అన్ని రాజకీయ, ప్రజాసంఘాలతో కలిసి సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెహానాబేగం మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీలోపు తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, మస్తాన్‌బీ, నగర కార్యదర్శి నాగేశ్వరరావు, క్రిష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మంగల పుల్లయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ప్రధాన ముఖద్వారం వద్ద ముళ్ల కంచె వేస్తున్న పోలీసులు



ముగ్గురమ్మల వైభోగం

గ్రామోత్సవంలో భక్తుల నీరాజనం ● అల్లూరులో పండుగ వాతావరణం

అల్లూరు: అల్లూరులో ముగ్గురమ్మలు గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మల గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. గ్రామోత్సవం ముందు గంగపెట్టెను తీసుకొని యాదవులు వీరతాళ్లను వేశారు. గ్రామంలో ప్రతి ఇంటి ముందు భక్తులు అమ్మవార్లకు పూజలు చేశారు. గుమ్మడికాయలు, కొబ్బరికాయలతో అమ్మవార్లకు దిష్టి తీశారు. తప్పెట్లు, మంగళవాయిద్యాలు, తెనాలి బ్యాండ్, కోలాటాలు, డిజే సౌండ్స్, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాగా, మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవార్ల ఆలయాల ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి లోటు రాకుండా ఏర్పాట్లు చేశారు. పోలీసు యంత్రాంగం గట్టి బందోబస్తు నిర్వహించింది.

సమ్మెలోకి 'అత్యవసర'ం!

- విధులు బహిష్కరించిన తాగునీటి సిబ్బంది
- అదేబాటలో వీధిలైట్ల సిబ్బంది, ఇంజనీరింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్లు
- ఫిట్టర్‌కూలీలు, వాల్‌ఆపరేటర్లూ ఆందోళన బాట
- ఉధృతమవుతున్న 'మున్సిపల్' సమ్మె

నెల్లూరు (సిటీ), జనవరి 3 : వైసీపీ ప్రభుత్వంపై ఉద్యమ జెండా ఎగరవేసిన మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది సమ్మెను మరింత ఉధృతం చేస్తున్నారు. 9 రోజులుగా విధులను బహిష్కరించిన పారిశుధ్య కార్మికులకు సంఘీభావంగా తాము సైతం మంటూ బుధవారం అత్యవసర సేవల విభాగాలకు చెందిన సిబ్బందీ ఆందోళనబాట పట్టారు. ఇంజనీరింగ్ విభాగంలోని వర్కు ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రికల్ సిబ్బంది, పంపు ఆపరేటర్లు, పీడబ్ల్యూఎస్ కార్మికులు, వాల్ ఆపరేటర్లు, ఫిట్టర్ కూలీలు విధులు బహిష్కరించి ఆందోళన బాటవైపు అడుగులు వేశారు. వేకువజామునే విధులకు దూరమైన వీరంతా పారిశుధ్య కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీంతో నెల్లూరు నగరవాసులకు అత్యవసర సేవలు ఆందోళనకరంగా మారాయి.

● **నగరంలో భారీ ర్యాలీ**

తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెలోనే కొనసాగుతామంటూ స్పష్టం చేస్తూ మున్సిపల్ కార్మికులు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముత్తుకూరు కూడలి నుంచి మినీబైపాస్ మీదుగా జ్యోతిరావుపూలే విగ్రహం వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని నడిపే కార్మికులు, సిబ్బందికి అన్నింటా అండగా నిలవాల్సిన సీఎం జగన్ మొండిగా వ్యవహరిస్తున్నారని దుయ్యపట్టారు. తామేమి అసాధ్యమైన కోర్కెలు కోరడం లేదని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ ఇచ్చిన హామీలను మాత్రమే నెరవేర్చమని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ ఆందోళనలో నాయకులు మోహన్‌రావు, కత్తి శ్రీనివాసులు, అల్లాడి గోపాల్, పెంచలనరసయ్య, కిన్నెర కుమార్, ఆర్ శ్రీనివాసులు, సతీష్‌లు పాల్గొన్నారు. కావలి, ఆత్మకూరు, కందుకూరు మున్సిపాలిటీల్లోనూ పారిశుధ్య కార్మికులు ఆందోళన చేశారు.

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు





వేధింపులు సరికాదు

● గడ్డితింటూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

నెల్లూరు (విద్య), జనవరి 3 : చట్ట ప్రకారం సమ్మె నోటీసు ఇచ్చి ఆందోళన చేస్తున్న తమను ప్రభుత్వం వేధింపులకు గురిచేయడం సరికాదని సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నేతలు ఆరోపించారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట గడ్డితింటూ ఉద్యోగులు వినూత్న నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ న్యాయమైన తమ కోర్కెలు తీర్చాలని కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోని యంత్రాంగం తాజాగా అధికారులతో బెదిరించే ప్రయత్నాలు ప్రారంభించడం బాధాకరమన్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదన్నారు. శుక్రవారం విజయ వాడలోని ఎస్పీడీ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు విష్ణువర్ధన్‌రావు, సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, హేమంతు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ హాళ్లలో వసతులు సక్రమంగా ఉండాలి

● కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం), జనవరి 3 : రాబోయే ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రంగా ఎంపిక చేసిన కళాశాలలో స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ హాళ్లలో వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ నెల్లూరు ఆర్డీవో మలోలను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్పీ, జేసీ, ఇతర అధికారులతో కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో బుధవారం చర్చించారు. కౌంటింగ్ కేంద్రంలో విద్యుత్, బారికేడింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు తదితరాలపై సూచనలు చేశారు. ఈ చర్చలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్వో లవన్న, డీఎస్పీలు వీరాంజనేయరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకట రమణ, కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి వారక్కడే!

- అధికార పార్టీలో సస్పెన్స్‌కు తెర
- సిటింగ్‌లకే టికెట్లు, జగన్‌తో వీపీఆర్ భేటీ
- నెల్లూరు ఎంపీ స్థానంలో బరిలోకి సిద్ధం

అసెంబ్లీ టికెట్ల విషయమై అధికర పార్టీలో నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది. ప్రస్తుతం పార్టీలో ఉన్న సిటింగ్ ఎమ్మెల్యేలకు, నియోజకవర్గ సమన్వయకర్తలకు యథాతథంగా ఇవ్వనున్నట్లు వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. కొన్ని అసెంబ్లీ టికెట్ల విషయమై అసంతృప్తిగా ఉన్న రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వీపీఆర్) అలకవీడి పార్లమెంట్ స్థానం నుంచి పోటీకి సిద్ధమయ్యారు.

నెల్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఎన్నికల్లో కొంతమంది సిటింగ్‌లకు టికెట్లు దక్కవని, కొంతమంది ఎమ్మెల్యేలను మరోచోటుకు బదిలీ చేసే అవకాశం ఉందని వైసీపీ వర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం నడిచింది. పార్టీలో అంతర్గతంగా చోటు చేసుకున్న అంతఃకలహాలు, తాజా సంఘటనల నేపథ్యంలో ముదిరిన విబేధాలపై ప్రచారానికి బలం చేకూర్చాయి. సర్వేలు, స్థానిక నాయకుల తిరుగుబాట్ల క్రమంలో నెల్లూరు నగరం, కావలి ఎమ్మెల్యేలను మరో నియోజకవర్గాలకు పంపుతారని, ఉదయగిరి ఇన్‌చార్జి మారే అవకాశం ఉందని బలంగా ప్రచారం జరిగింది. అయితే ఈ ముగ్గురే కాకుండా జిల్లా పరిధిలో అభ్యర్థులను ఎవరిని మార్చడం లేదని జగన్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీపీఆర్‌కు, ఇతర ముఖ్య నాయకులకు సమాచారం అందజేశారు. నెల్లూరు పార్లమెంట్ స్థానంలో గెలవాలంటే కొన్ని అసెంబ్లీలకు అభ్యర్థులను మార్చాలని వీపీఆర్ అధిష్ఠానానికి ప్రతిపాదన పంపారు. ఒకవేళ అభ్యర్థులను మార్చని పక్షంలో తాను బరిలో నుంచి తప్పుకుంటానని అగ్రనాయకుల ద్వారా జగన్‌కు సందేశాలు పంపినట్లుప్రచారం జరిగింది. ఈ క్రమంలో మంగళవారం సీఎం జగన్ వీపీఆర్‌ను పిలిపించుకొని మాట్లాడారు. అభ్యర్థులను మార్చడం సాధ్యం కాదని, గెలుపు విషయంలో అనుమానపడాల్సిన పనిలేదంటూ పోటీకి ఒప్పించారు. జగన్‌తో భేటీ తరువాత బుధవారం నుంచి తిరిగి వీపీఆర్ ప్రచారంలో నిమగ్నమయ్యారు. దీంతో జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్ యాదవ్ (నెల్లూరు నగరం), ప్రతాప్ కుమార్‌రెడ్డి (కావలి), ప్రసన్న కుమార్ రెడ్డి (కోవూరు), కాకాణి గోవర్ధన్‌రెడ్డి (సర్వేపల్లి), మేకపాటి విక్రమ్‌రెడ్డి (ఆత్మకూరు)లతోపాటు నెల్లూరు రూరల్, ఉదయగిరి సమన్వయ కర్తలు ఆదాల ప్రభాకరరెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డిలు వైసీపీ అభ్యర్థులుగా బరిలో దిగనున్నారు.



నెల్లూరు : వీపీఆర్‌ను కలిసిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్య

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి



కావలి : సావిత్రి బాయి పూలేకి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఆత్మకూరు: సావిత్రి బాయి పూలేకి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఉపాధ్యాయులు

కావలిటౌన్, జనవరి 3 : మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయినులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్యలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు బుధవారం వెంగళరావునగర్‌లోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో జరిగాయి. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు హయ్యూల్‌హ యయ్యామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయిని శర్వాణి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

కావలి : సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కర్యాక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

బిట్రగుంట : సావిత్రిబాయి పూలే ఆదర్శమూర్తి అని ఎంఈవో జయమ్మ, ప్రిన్సిపాల్ పద్మజ అన్నారు. బోగోలు మండలం గురుకుల పాఠశాల్లో బుధవారం రామిశెట్టివెంకట సుబ్బారావు ట్రస్ట్ కన్వీనర్ మెతుకు రాజేశ్వరి ఆధ్వర్యంలో పూలే జయింతి వేడుకలు జరిగాయి. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఎంఈవోలతోపాటు మండలంలోని 30 మంది ఉపాధ్యాయిలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 నరసింహరావు, ప్రసాద్‌రావు, రవి, కృష్ణప్రసాద్,కిషోర్, రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం: సావిత్రీబాయి పూలే జయంతిని మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో- 2 ఆనందరావు తదితరులు పూలే దంపతుల చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రిన్సిపాల్ జయంతిని ఘనంగా సన్మానించారు.

లింగసముద్రం: సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పెంట్రాల ప్రాథమికోన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కె మోహన్‌రావు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత, ఏసీఎస్ఆర్ కాలనీలలోని ప్రాథమిక పాఠశాలల్లో సావిత్రిబాయ్ పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంగం: మండలంలోని ఉడ్‌హౌస్‌పేట ప్రాథమిక పాఠశాలలో సాయిత్రి బాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇద్దరు ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు జానకిరామ్, మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ పేట : కావలి ఎడవల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో బుధవారం సావిత్రిబాయ్ పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయినులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



అల్లూరు : ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి లలిత

అల్లూరు, జనవరి 3 : మండలంలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం వ్యవసాయాధికారి లలిత ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరమైన యూరియాతోపాటు అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద కూడా యూరియా రైతులకు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రైవేటు డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : పట్టణంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి వీ. రాము బుధవారం తనిఖీ చేశారు. రైతుల వద్ద అధిక ధరలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో డీఏపీ 36.4 మెట్రిక్ టన్నులు, యూరియా 76.2 టన్నులు, సింగిల్ సూపర్ ఫాస్పేట్ 100.25 మెట్రిక్ టన్నులు, అమ్మోనియం సల్ఫేట్ 86.85 టన్నులు, అన్నిరకాల కాంప్లెక్స్ ఎరువులు 342.55 టన్నులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.

ఉలవపాడు : ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారిణి బీ తిరుమల జ్యోతి హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. మండలంలోని ఆర్బీకేలకు 40 టన్నుల, ప్రవేటు డీలర్స్ వద్ద 125 టన్నుల యూరియా నిల్వలు ఉన్నట్లు ఆమె చెప్పారు.

కందుకూరులో మున్సిపల్ కార్మికుల ప్రదర్శన

కందుకూరు, జనవరి 3: స్థానిక పారిశుధ్య కార్మికులు బుధవారం నుంచి సమ్మె నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు బీ సురేష్‌బాబు, సీఐటీయూ నాయకులు ఎస్ఏ గౌస్‌లు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్క రించేవరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ నిరసనలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు డీ రామమూర్తి, మురళీ, వై. ఆనంద్‌మోహన్, కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు, మెండా మహేంద్ర, దార్ల శేషమ్మ, ఎద్దు కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

కావలిటౌన్ : మున్సిపల్ కార్మికులను ప్రభుత్వం వంచించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పేర్కొన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మెలో పాల్గొన్నారు. ఈ శిబిరంలో అంకయ్య మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న ముఖ్యమంత్రి హామీ ఇంతవరకు అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేత నాగరాజు, ఏఐటీయుసీ నేతలు పీ శంకర్‌కిషోర్, ఆదినారాయణ, గుంజి కిషోర్, తన్నీరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా సీఐటీయూ ఆధ్వర్యంలో నేతలు పెంచలయ్య, కృష్ణమోహన్, యూనియన్ నేతలు తురకా శీనయ్య, రమేష్, ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరింది. బుధవారం సీఐటీయు ఆధ్వర్యంలో మరికొందరు కార్మికులు విధులను బహిష్కరించి స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి సంఘీభావం ప్రకటిస్తూ శిబిరంలో రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనతను వీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయు, ఏఐటీయుసీ, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ల నాయకులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



కందుకూరులో మున్సిపల్ కార్మికుల నిరసన ప్రదర్శన



కావలిలో సమ్మె చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు



ఆత్మకూరు : రిలే దీక్షలో కూర్చున్న కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి

ఇళ్ల స్థలాల కోసం గ్రామస్థుల ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ఉదయగిరి, జనవరి 3: మండలంలోని శకునాలపల్లి సచివాలయం ఎదుట బుధవారం బీసీ కాలనీ వాసులు ఇళ్ల స్థలాల కోసం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ కాలనీలో నివసిస్తున్న అనేక మంది నిరుపేదలకు ఇంటి స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి కరీముల్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో షరుద్దీన్, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

అనంతసాగరం, జనవరి 3: స్థానిక ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నూతనంగా మంజూరైన 122 మంది పెన్షన్ లబ్ధిదారులకు నగదు అందించారు. అనంతరం పలువురు పలు సమస్యలపై అర్జీలను విక్రమ్‌రెడ్డికి అందించారు. కార్యక్ర మంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంపీడీవో మదుసుదన్‌రావు, సర్పంచ్‌లు, నాయకులు, అదికారులు పాల్గొన్నారు.

మర్రిపాడు: సోమశిల హైలెవల్ కెనాల్ పనులను ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి తిరిగి వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తిచేస్తామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వైఎస్ఆర్ పింఛను లబ్ధిదారుల సభలో మాట్లాడారు. తొలుత సావిత్రిబాయి పూలె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం పింఛన్ లబ్ధిదారులకు బ్రోచర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగమణి, మండల వైసీపీ కన్వీనర్ సుబ్బిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మార్వో సుధాకర్ రావు, ఈవోపీఆర్డి భార్గవి, ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, వైసీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, మాజీ జెడ్పిటిసి గురవారెడ్డి, ఎంపీటీసీ అల్లూరురాజు, జెసిఎస్ మండల కన్వీనర్ బాలినేని మాబయ్య, అబ్రహం మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 33.388 టీఎంసీల నీరు

అనంతసాగరం, జనవరి 3: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవారం 31 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలకు గాను 33.388 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,550, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 20 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కరసేవకులకు సత్కారం

సంగం, జనవరి 3: మండలంలోని పలు గ్రామాల నుంచి 1990లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అయోధ్యకు తరలిన కరసేవకులను బుధవారం స్థానిక సంగమేశ్వరాలయంలో ఘనంగా సత్కరించారు. కోటు కరుణాకర్‌రెడ్డి, టంగుటూరి గోపాలకృష్ణమూర్తి, కర్నాటి రవీంద్రరెడ్డి, వేమా మల్లికార్జునరావు, పి చంద్రశేఖర్‌రెడ్డి, కాలం బుజ్జిరెడ్డి, కాకు రఘురామ్ యాదవ్, కోటు అనిల్‌కుమార్‌రెడ్డి, కంతా బత్తిన రవీంద్రరెడ్డి, వెన్నా శ్రీనివాసులురెడ్డి, శ్రీహరిరెడ్డి, కరుణాకర్ తదితరులు కరసేవకులుగా అయోధ్యకు వెళ్లిన వారిలో ఉన్నారు. వీరందరిని బీజేపీ సీనియర్ నాయకులు కర్నాటి ఆంజనేయలురెడ్డి, సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రంధి గోపికృష్ణ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉదయగిరి అభివృద్ధే ధ్యేయం : బొల్లినేని



మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బొల్లినేని

ఉదయగిరి రూరల్, జనవరి 3: నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, రహదారులను మెరుగుపరిచేందుకు అధికారులు, పాలకులు చేపట్టిన చర్యలు శూన్యమని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. బుధవారం ఉదయగిరి పట్టణంలోని యూనియన్‌రోడ్డు, గుంతబజార్, ప్రభుత్వ వైద్యశాల తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజాదీవెన యాత్ర చేపట్టి ఇంటింటికీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ఉదయగిరి పట్టణంలో ప్రజల కష్టాలను తీరుస్తామన్నారు. ఉదయగిరి దుర్గంపైకి రోప్‌వే ఏర్పాటుచేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. యాత్రలో భాగంగా బొల్లినేని కుట్టుమిషన్‌పై దుస్తులు కుట్టి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావు, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, నరసింహా, సందానీ, సజిల్, శ్రీకుర్తి రవీంద్రబాబు, మాబాషా, శివకృష్ణ, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ పటిష్టతకు కృషి చేయాలి



సచివాలయ అధికారులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

ఆత్మకూరు, జనవరి 3: గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ పటిష్టతకు సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కృషిచేయాలని ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. మండలంలోని మహిమలూరు, రామస్వామి పల్లి, చెర్లోయడవల్లి సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈనెల 19వ తేదీన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటుచేస్తున్న సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 8న మండలంలోని అన్ని అంబేద్కర్ విగ్రహాలను అలంకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు కల్పించాలి

సంగం, జనవరి 3: గ్రామ సచివాలయ వ్యవస్థలో పనిచేసే అన్ని డిపార్ట్‌మెంట్లకు కల్పించిన విధంగానే పదోన్నతలు కల్పించాలని బుధవారం డిజిటల్ అసిస్టెంట్‌లు తహసీల్దారు నాగరాజుకు వినతిపత్రం అందచేశారు. పే స్కేల్ రూ. 34,580 ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో మండలంలోని సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో, తహసీల్దారు

సంగం, జనవరి 3: మండలంలోని దువ్వూరు గ్రామంలో ఆర్డీవో మధులత, తహసీల్దారు నాగరాజు ఓటర్లకు ఈవీఎం, వివి ప్యాట్‌ల వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో అవి ఏవిధంగా పనిచేస్తాయో ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పంచాయతీ అభివృద్ధిపై గ్రామసభ

ఉదయగిరి, జనవరి 3: ఉదయగిరి పంచాయతీ గ్రామసభ బుధవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సామ్రాజ్యం అధ్యక్షతన జరిగింది. పంచాయతీ అభివృద్ధికి అవసరమైన తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో నరసయ్య, ఉప సర్పంచ్ ముర్తుజా, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్పీ ఎస్థానీ, వార్డుసభ్యులు శ్రీనివాసులు, రియాజ్, పెంచలయ్య, ఉప్పుటూరి హరి తదితరులు పాల్గొన్నారు.

రెండవ పట్టణ, రూరల్ సీఐలు బాధ్యతల స్వీకరణ

కావలి రూరల్, జనవరి 3: స్థానిక రెండవ పట్టణ సీఐగా కొండవీటి శ్రీనివాసరావు, రూరల్ సీఐగా కాటూరి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రెండవ పట్టణ సీఐగా పనిచేసిన అన్నంగి సుధాకర్‌ను గుంటూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేసి, ఒకటవ పట్టణ సీఐగా పనిచేస్తున్న శ్రీనివాసరావును రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే గతంలో ఒకటవ పట్టణ సీఐ గా పనిచేసి పామూరుకు బదిలీపై వెళ్లిన శ్రీనివాస్ గౌడ్ రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

పెట్రోల్ బంకులో వసతులు కల్పించాలి

వరికుంటపాడు, జనవరి 3: స్థానిక పెట్రోల్ బంకులో వినియోగదారులకు అన్నిరకాల వసతులు కల్పించాలని వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ సభ్యుడు చల్లగాలి వెంకటమోహన్ అన్నారు. బుధవారం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పెట్రోలు బంకులో వసతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాలి మిషన్ ఏర్పాటు చేయక పోవడంతో పాటు మరుగుదొడ్లు, తాగునీటి వసతి సైతం సక్రమంగా లేకపోగా కనీసం వసతులను తెలిపే సూచిక బోర్డులు కూడా కనిపించక పోవడం దారుణమంటూ మండిపడ్డారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి వసతుల ఏర్పాటుకు కృషి చేయాలని డిమండ్ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డీ. మహేష్, పీ. మల్లికార్జున పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు

సీతారామపురం, జనవరి 3: నూతన సంవత్సరం సందర్భంగా సీతారామపురం గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ సిక్స్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ సింగారెడ్డిపల్లి, సీతారామపురం క్రికెట్ జట్ల మధ్య బుధవారం సీతారామపురంలోని సబ్‌స్టేషన్ వద్ద జరిగింది. ఈ మ్యాచ్‌లో సీతారామపురం జట్టు పై సింగారెడ్డిపల్లి జట్టు గెలిచింది. గెలిచిన జట్టుకు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్ రూ. 10,116, రన్నరప్‌గా నిలిచిన సీతారామపురం జట్టుకు చప్పిడి వెంకటమ్మ రూ. 5,116 అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు పెద్దగొను, పిడుగు మురళి, జయరాములు, తోట ఏడుకొండలు కార్యనిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.

యానాదిశెట్టి సేవలు మరువలేనివి!

● ప్రముఖుల నివాళి



యానాదిశెట్టి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

కావలి,జనవరి3: మున్సిపల్, ఏఎంసీల మాజీ ఛైర్మన్‌గా, టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా గ్రంధి యానాదిశెట్టి అందించిన సేవలు మరువలేనివని పలువురు రాజకీయ ప్రముఖులు కొనియాడారు. యానాదిశెట్టి సంతాప సభ బుధవారం బృందావనం కాలనీలోని కల్యాణ మండపంలో జరిగింది. రాజకీయాలకు అతీతంగా పలువురు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ యానాదిశెట్టి తన రాజకీయ జీవితంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తానున్నానంటూ సేవలు అందించారన్నారు. కావలి ఆర్యవైశ్యులకు గుర్తింపు తెచ్చారన్నారు. ఆయన కాంస్య విగ్రహాన్ని కావలిలో ఏర్పాటు చేయాలని తెలిపారు. కాంస్య విగ్రహ ఏర్పాటుకు ఖర్చును తాను భరిస్తానని టీడీపీ నేత కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకటరామారావు, కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్, కావలి టీడీపీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, బీజేపీ నేత జీ. భరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం : బీఎమ్మార్



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్

కావలి రూరల్, జనవరి3: ప్రజా సంక్షేమమే సీఎం జగనన్న లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. స్థానిక ఎమ్పీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం గ్రామీణ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతాప్‌రెడ్డిని ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేను చేయడంతోపాటు జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బీఎమ్మార్ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జంపాని రాఘవులు, ఎంపీపీ ఆలూరి కొండమ్మ, ఏఎంసీ ఛైర్మన్ ఎస్. ప్రసాద్ యాదవ్, ఎమ్పీడీవో క్రిష్ణమోహన్‌రావు, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, వైసీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనుమర్లపూడి నారాయణ, నాయుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆర్యవైశ్య నేతల సమావేశం



టీడీపీ ఆర్యవైశ్య నాయకులతో సమావేశమైన డూండి రాకేష్

కావలిటౌన్, జనవరి3: టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండి రాకేష్ బుధవారం పట్టణ ఆర్యవైశ్య నేతలతో సమావేశమయ్యారు. జనతాపేటలోని వాణిజ్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి తటవర్తి వాసు నివాసంలో జరిగిన సమావేశంలో పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, వాణిజ్య విభాగం నేతలు రాకేష్ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో వ్యాపారులు విసిగిపోయారని, తమకు రక్షణ కరువైందన్నారు. మరో 3నెలల్లో సమస్యలన్నీ పరిష్కారమౌతాయని, రానున్న టీడీపీ ప్రభుత్వంలో వ్యాపారులకు ఢోకా వుండదని ఆశాభావం వ్యక్తపరిచారు. కార్యక్రమంలో నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కోట రమేష్, వాయుగండ్ల వెంకటేశ్వర్లు, చవల మురళి, కర్లా ప్రభాకర్, దర్శి హరికృష్ణ, కోట బ్రహ్మం గుప్తా, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లతో ఉద్యోగావకాశాలు

కందుకూరు : పైథాన్, మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ తదితర సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పట్టుసాధిస్తే మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని డీకోడ్ సాఫ్ట్ టెక్ సొల్యూషన్స్ సంస్థ సీఈవో ఎం. దత్తాత్రేయగౌడ్ తెలిపారు. స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్‌ఈ మూడవ సంవత్సర విద్యార్థులకు పదిరోజుల పైథాన్ వర్క్‌షాప్‌ను బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో మూడు సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లను క్షుణ్ణంగా నేర్పించటంతోపాటు వెబ్ పేజీలను, విండోస్ ఆండ్రాయిడ్ ఆధారిత అప్లికేషన్ల రూపకల్పన నేర్పుతామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ కె. విజయ్ శ్రీనివాస్, అకడమిక్ ఇన్‌చార్జి ఎస్ఎం మీరావలి, షరీఫ్, ఏడుకొండలు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టండి

కలిగిరి : ఆలయాల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను భక్తులు కోరుతున్నారు. పట్టణంలో సాయిబాబా మందిరం, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద ప్రత్యేక వారాలతోపాటు పండుగ రోజుల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.దీంతో పారిశుధ్య సమస్య తలెత్తుతుంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి చెంచుకృష్ణయ్య మాట్లాడుతూ ఆలయాల నిర్వాహకులు అన్నదానం, ఇతర కార్యక్రమాలు ఏర్పాటు చేసుకునేటప్పుడు, ఆ విషయాన్ని పంచాయతీ దృష్టికి తీసుకువస్తే తమ సిబ్బందితో ప్రత్యేక వాహనం సమకూర్చి పారిశుధ్య చర్యలు చేపడతామన్నారు.

రేపటి కనిగిరి సభను జయప్రదం చేయండి : ఇంటూరి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు : కనిగిరిలో శుక్రవారం జరగనున్న చంద్రబాబు బహిరంగ సభను జయప్రదం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కందుకూరు పట్టణం, రూరల్ మండలాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రా కదలి రా.. కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు రాష్ట్రంలో ఎన్నికల శంఖారావం పూరించారని, ఆ కార్యక్రమంలో భాగంగా తొలుత కనిగిరిలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సభ జరుగుతుందన్నారు. ఈ సభకు కందుకూరు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్‌బాబు, దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

భూమి హక్కు యాజమాన్య చట్టాన్ని రద్దుచేయాలి

కందుకూరు : భూమి హక్కు యాజమాన్య చట్టాన్ని రద్దుచేయించాలని కోరుతూ న్యాయవాదులు బుధవారం ఎమ్మెల్యే మహీధరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్లపల్లి మల్లికార్జున, షేక్ షంషుద్దీన్‌ల ఆధ్వర్యంలో న్యాయవాదులు ఎమ్మెల్యేని కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ భూమి యాజమాన్య హక్కును నిర్ధారించే అధికారం మండల స్థాయిలో టైటిలింగ్ అధికారికి మాత్రమే ఉంటుందన్నారు. తక్షణం ఈ చట్టం రద్దుకు పోరాటం చేయాలన్నారు.

దుప్పట్ల పంపిణీ

బిట్రగుంట : హైదరాబాద్‌కు చెందిన శ్రీరామదూత ట్రస్ట్ నిర్వాహకులు బుధవారం పేద, దళిత గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కొండబిట్రగుంటకు చెందిన రావి విజయకుమార్ యాదవ్ చేతుల మీదుగా వీటిని అందచేశారు. కార్యక్రమంలో కొండబిట్రగుంట, పాతబిట్రగుంట గ్రామాల యువత పాల్గొన్నారు.

● దుమ్ము లేవకుండా నీటి చల్లకం

బోగోలు మండలంలో గ్రావెల్ అక్రమ తరలింపు జోరుగా సాగుతోంది. దీంతో కప్పరాళ్ల తిప్ప జాతీయ రహదారి ఎర్రదుమ్ముతో నిండింది. దీంతో ద్విచక్రదారులు, స్థానికులు ప్రమాదాల బారిన పడుతుండటంతో బుధవారం ట్యాంకుల ద్వారా నీరు చల్లారు.

ముగిసిన మేట్ల శిక్షణ

లింగసముద్రం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న ఉపాధి పథకం మేట్ల శిక్షణ బుధవారం ముగిసింది. శిక్షణలో మస్టర్ల నిర్వహణ, కొలతల ఎలా తీయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో షేక్ సమీర్ బాషా, ఈసీ చిన కోటయ్య, టీఎఫ్‌టీ ఎం ఇక్రయ్య, టీఏలు ఆర్ రాజ్‌కుమార్, జీవీ రాఘవులు, కే మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.